నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు తిరుపతి
మంగళవారం 1 జూలై 2025 పేజీలు 11

## ముఖ్యమంత్రి పాల్గొనే ప్రదేశాలలో పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలి

**మంగళవారం మధ్యాహ్నం లోపు పనులన్నీ పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్**



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి పాల్గొనే ప్రదేశాలలో పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కుప్పం నియోజకవర్గ పరిధిలోని, శాంతిపురం మండలంలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 1, 2వ తేదీ పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. సోమవారం ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, రూట్ మ్యాప్, సంబంధిత అంశాలపై అడ్వాన్స్ సెక్యూరిటీ లైసెనింగ్ (ఏఎస్ఎల్)లో భాగంగా శాంతిపురం మండలంలో తుమ్మిశి పంచాయతీ డుంకుమానిపల్లెవద్ద హెలిప్యాడ్ ప్రాంతానికి వెళ్లి అక్కడ చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేశారు. కడపల్లెలోని ముఖ్యమంత్రి నివాసం గట్టి భద్రత చర్యలు చేపట్టాలి. జూలై 2వ తేదీన శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లె గ్రామం 28 ఇళ్లను ఇంటింటి పర్యటనలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఆర్ అండ్ బి, డిపిఓ ఆధ్వర్యంలో ప్రతిష్టమైన బారికేడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. శాంతిపురం మండలం తుమ్మిసిలోని ఏపి మోడల్‌స్కూల్ చేరుకుని పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమలలో పాల్గొని బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. మంగళవారం మధ్యాహ్నం లోపల బహిరంగ సభ సుందరీకరణ పనులు పూర్తిచేయాలని, మంచి గాలి వెలుతురు ఉండేవిధంగా ఆహ్లాదంగా ఉండాలన్నారు. కుప్పం ఏరియా ఆసుపత్రి చేరుకుని టాటా సంస్థ ద్వారా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అక్కడ పటిష్టమైన భద్రత, వైద్య సేవలు ఉండాలని పేర్కొన్నారు. సీఎంఓ కార్యాలయం నుండి అధికారులు ప్రతినిధులు, డీఎస్పీలు, జాయింట్‌కలెక్టర్ విద్యాధరి, డిపిఓ ప్రభాకర్, ఆర్డీవో శ్రీనివాసులు రాజు, అడిషనల్ ఎస్పీ నందకిషోర్, డీఎస్పీ రాజ్నాథ్, సాయినాథ్, ఫైర్ ఆఫీసర్ పెద్దిరెడ్డి, శాంతిపురం ఎమ్మార్వో, శివయ్య ఎంపీడీఓ కుమార్ పాల్గొన్నారు.





### నగరంలోని ట్యాంకుల సుందరీకరణ పనులు

## వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

తిరుపతి నగరంలోని పలు ట్యాంకులు (కుంటలు) సుందరీకరణ పనులను వేగవంతంగా పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు తిరుపతి నగరంలోని వివిధ ట్యాంకర్ల సుందరీకరణ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి, డ్వామా పిడి శ్రీనివాస ప్రసాద్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి ట్యాంకుల పునరుద్ధరించడం కోసం సుందరీకరణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా దామినేడు, పేరూరు, ఆవిలాల రామక్క చెరువు, తూకివాక వెంకటాపురం, వెలమంద్యం వినాయక సాగర్, పాన్ చెరువు, గొల్లవాని గుంట, కోరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా స్మార్ట్ సిటీలో భాగంగా వినాయకా సాగర్, గొల్లవాణి గుంట ఇప్పటికే అభివృద్ధి చేశారని, మిగిలిన వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొరమేను గుంట చెరువుకు సంబంధించిన వాకింగ్ ట్రాకర్స్, ప్లాంటేషన్ సంబంధించిన అభివృద్ధి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటప్రసాద్, తుడ ఎస్ఈ కృష్ణ రెడ్డి, ఈఈ రవీంద్రనాథ్, డీపీఓ సుశీలాదేవి పాల్గొన్నారు.

### పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు మొదటి ప్రాధాన్యతతో

## పరిష్కారం చూపాలి

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 296 అర్జీలు**

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అందే ప్రతి అర్జీలకు నాణ్యతగా గడువు లోపు పరిష్కారం చూపాలి**

**జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పదంతో వ్యవహరించాలని కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంనకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణంలో వారు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, వైద్య ఆరోగ్య శాఖ వారిచే మెడికల్ క్యాంపు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు వచ్చిన అర్జీదారులకు నుంచి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీఓలు తహసీల్దారులు, ఎంపిడిఓలు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే



మిగతా 2లో

## రొయ్యలకు వ్యాధులు.. కుదేలౌతున్న సాగుదారులు

**పట్టని పాలకులు... ఆదుకునే నాథుడెవరు**

**గూడూరు, మేజర్‌న్యూస్:** పాలకులు "చెప్పేదొకటి చేసేదొకటి"గా మారడంతో రొయ్యల సాగుదారులు కుదేలౌతున్నారు. అంతర్జాతీయ పరిణామాలు... వ్యాధులు... అధికారులు సాగు భారమైతుండగా సిండి"కేట్" అవుతున్న కొనుగోలుదారుల కారణంగా సాగుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు డివిజన్ పరిధిలోని చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో పది వేల ఎకరాల్లో రొయ్యలసాగు చేస్తుంటారు. గతంలో రొయ్యల సాగుదారులకు ప్రభుత్వ మద్దతు అంతంత మాత్రంగా ఉండగా ఆదుకుంటామన్న కూటమి ప్రభుత్వం ఆచరణలో పెట్టకపోవడంతో సాగుదారులు అవస్థలు పడుతున్నారు. టైగర్, వైనామి రొయ్యల సాగు చేస్తూ సాగుదారులు తమ అదృష్టం పరీక్షించుకునే పనిలో ఉంటే పరిస్థితులు ప్రతికూలంగా మారుతుండడంతో సాగుదారుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే వెనామి రొయ్యల సాగు సగాటికి సగం పడి పోయి తిరిగి టైగర్ రొయ్య సాగు వైపు మల్లుతన్న సాగుదారులకు వ్యాధులు మేమున్నాం అంటూ పలకిరిస్తుండడంతో ఆందోళన నెలకొంది. వ్యాధుల నేపథ్యంలో టైగర్‌కు మళ్లిన సాగుదారులకు సీడ్ ధర ఆకాశాన్ని అంటుతుండడమే కాకుండా మందస్తు చెల్లింపులు చేస్తేనే సీడ్ ఇస్తుండడంతో సకాలానికి సీడ్ దొరుకుతుందో లేదో కూడ చెప్పలేని పరిస్థతి. చెరువులో రొయ్య చేతికొస్తుందో లేదో అని వణికిపోతున్నారు. కొద్ది రోజులుగా తెల్లమచ్చ (వైట్స్పాట్ సిండ్రోమ్) వ్యాధి ప్రబలుతోంది. ఈ హెచ్పీ (ఎంటెరో సైటోజూన్ హెపటోపెనాయ్) వ్యాధి తీవ్రత కూడా చెరువుల్లో అధికంగా ఉంది. రెండూ కలిసి రొయ్య రైతును పీల్చి పిప్పి చేస్తున్నాయి. కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతల్లో తగ్గుదల, వర్షాలు, పీహెచ్ స్థాయిలో మార్పులు కూడా అక్వా రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. రైతులు ఎకరాకు రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేస్తున్నారు. రొయ్యలను తెల్లమచ్చ, ఈ హెచ్పీ ఆశిస్తే.. రైతులు నిండా మునగడమే. పిల్ల రొయ్య నుంచి పట్టుబడికి సిద్ధంగా ఉన్న వాటి వరకు

మిగతా 2లో



## మైనింగ్ బిల్లులు సక్రమంగా లేని మూడు లారీలు సీజ్

**సత్యవేడు మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లాలోని సత్యవేడు మండల పరిధిలోని చమర్తికండ్రిగ గ్రామంలో గల సెవెన్ హిల్స్ క్వారీ నుండి తమిళనాడుకి రోజుకి కొన్ని వందల ట్రిప్పర్‌లు నకిలీ బిల్లులతో వెళుతున్నాయి. సమాచారం అందుకున్న మైనింగ్ అధికారులు ఆకస్మిక తనిఖీలలో అధిక లోడ్డుతో నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న మూడు



కంకర లారీలను తిరుపతి మైనింగ్ అధికారులు స్వాధీనం చేసుకొని సత్యవేడు ఆర్టీసీ డిపోకి తరలించారు. నకిలీ బిల్లులతో వెళుతున్న వాహనాలను క్వారీలనుపై దర్యాప్తు చేస్తున్నారు. దీనివలన గవర్నమెంట్ ఆదాయానికి గండీ కొడుతున్నా క్వారీలపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**దొరవారిసత్రం మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని అక్కరపాకు గ్రామ సమీపాన ఉన్న జాతీయ



రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసులు అను అతనికి గాయాలయ్యాయి. వివరాల మేరకు శ్రీనివాసులుది స్వగ్రామము అక్కరపాకు ఇతను సూళ్లూరుపేటకు పోవుటకు తన బైక్‌పై వెళుతూ ఉండగా జాతీయ రహదారిపై వెళుతున్న ఆటోని బైకుతో వెనకనుంచి అదుపుతప్పి ఢీకొన్నాడు. దీంతో శ్రీనివాసులకి గాయాలయ్యాయి ఇతన్ని చికిత్స కొరకు స్వర్ణ టోల్ వేస్ అంబులెన్స్‌లో సులూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు,ఈవిషయంపై పోలీసు కేసు నమోదు చేసి డెవలప్ చేస్తున్నట్లుగా తెలిపారు.

## రూ.6లక్షల విలువ గల రేషన్ బియ్యం పట్టివేత

**నగరి మేజర్‌న్యూస్:** నగరిలో రూ.లక్షల విలువగల రేషన్ బియ్యం, వాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగరి తిరుత్తని బైపాస్ రోడ్డు నందు పోలీస్, రెవిన్యూ డిపార్ట్మెంట్ వారి తనిఖీల్లో భాగంగా రేషన్ బియ్యం ఐదు వాహనాల నందు గుర్తించడం జరిగింది. రేషన్ బియ్యం తరలింపుపై పోలీసు వారికి అనేకసార్లు ఫిర్యాదులు అందుకోవడం జరిగింది. అందు



వలన దీనిపై ప్రత్యేక నిఘ ఉంచి ఈరోజు పట్టుకోవడం జరిగింది. ఈ బియ్యం చుట్టుపక్కల గ్రామాల నుండి సేకరించి తమిళనాడుకు తరలించడానికి సిద్ధంగా ఉంచారు. ఈ బియ్యం నిల్వ మొత్తం 13 టన్నులుగా గుర్తించడం జరిగింది. దీన్ని మార్కెట్ విలువ సుమారు ఆరు లక్షల ఉంటుందని సమాచారం. ఈ బియ్యం తరలింపు ప్రధాన నిందితుడిగా ఉన్న అమృత రాజ్ నాడార్ మరియు అతని దగ్గర పనిచేస్తున్న 8 మంది కూలీలు పై పోలీసులవారు కేసు నమోదు చేయడం జరిగింది ఇతర వివరాలు సేకరిస్తున్నట్లు నగరి సీఐ విక్రమ్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చిత్తూరు బ్యూరో, మేజర్‌న్యూస్:** పుత్తూరు మండలం కనకంపాలెం కు చెందిన సుబ్రమణ్యం



నాయుడు(55) సోమవారం ఉదయం 8 గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వ్యక్తిగత పనిపై ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద తనయుడుతో కలిసి బైక్ పై రోడ్డును దాటే క్రమంలో ఐచర్ వాహనం ఢీ కొంది. తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా తనయుడుకి తీవ్రగాయాలయ్యాడు. మొదట తనయుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ ఓబయ్యకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



**తిరుపతి, మేజర్‌న్యూస్:** ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలగా బాధ్యతలు స్వీకరించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ గారిని మర్యాద పూర్వకంగా కలిసిన టి పద్మజ.

# రొయ్యలకు వ్యాధులు... కుదేలౌతున్న సాగుదారులు

(మొదటిపేజీ తరువాయి)

వైరస్ బారిన పడుతున్నాయి. రొయ్యల ఎదుగుదల లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం అని సాగుదారులు వాపోయారు. అడిగిన ధరకు ఇచ్చేయడమే వ్యాధి సోకిన ప్రాంతాల్లో వెంటనే పట్టుబడి చేయకపోతే.. ఆరోగ్యకరమైన రొయ్యలు కూడా చేతికి రావు. దీంతో వ్యాపారులు ధర తగ్గించి అడుగుతున్నారు. రైతులు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో అడిగిన ధరకు ఇచ్చేస్తున్నారు. వాతావరణ మార్పులతో అయిదెకరాల రొయ్యల చెరువులో అప్పటికప్పుడు పట్టుబడి చేస్తే ఎకరాకు సగటున రూ.లక్ష చొప్పున నష్టం వస్తున్నట్లు సాగుదారులు ఆవేదన చెంతున్నారు. ఇటీవల వెనామికి వ్యాధులు ఎక్కువగా ఉండడంతో బ్లాక్ టైగర్ రొయ్య సాగు పెరిగింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలు తగ్గకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. నష్టపోతున్నా.. పట్టించుకొనే నాధుడు లేరని రొయ్యల సాగుదారులు వాపోతున్నారు. ఆక్వా రైతులు ఉత్పత్తి, ఎగుమతుల్లో ఎంతో ప్రగతి సాధిస్తున్నా.. అవసరమైన వసతుల కల్పనకు మాత్రం నోచుకోవడం లేదు. రొయ్యలకు వ్యాధుల కారకాలు ఉన్నాయని ప్రతి ఏటా సాగుదారులకు కొనుగోలుదారులు వేల కోట్ల రూపాయలు ఎగనామం పెడుతున్నారని (2021-23 మధ్య అధ్యయనం) కేంద్ర పరిశోధనా సంస్థలే వెల్లడిస్తున్నాయి. అయినా నష్టతీవ్రత తగ్గించేందుకు, రొయ్య రైతును ఆదుకునేందుకు కొన్నేళ్లుగా తీసుకుంటున్న చర్యలు శూన్యం. రాష్ట్రంలో ఒక్క జాతీయ పరిశోధనా సంస్థగానీ, అభివృద్ధి బోర్డులుగానీ లేవు. ప్రాంతీయ కేంద్రాలు, ఉపశాఖలు ఏర్పాటు చేసి మమ అన్పిస్తున్నారు. లక్షలమంది మత్స్యరంగంపై ఆధారపడి ఉన్నా దేశీయ సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏపీ వాటా 36%. ఏడాదికి రూ.20వేల కోట్లకు పైగా ఎగుమతులు జరుగుతున్నా ఎంపెడా ప్రధాన కార్యాలయమూ లేదు. ఫలితంగానే వ్యాధులతో నష్టాలు, ధర దక్కక కష్టాలు.. అప్పు పుట్టక అగచాట్లు పడుతున్నారు. వైట్‌స్పాట్ సోకితే ఒకటి, రెండు రోజుల్లో చెరువు ఖాళీ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ లోగా పట్టుబడి చేసి వచ్చినంత తీసుకోవడం తప్ప మరో మార్గం ఉండదు. ఆరోగ్యంగా ఉండే రొయ్య వారానికి రెండు గ్రాముల పైన పెరగాలి. ఈహెచ్‌పీ సోకితే.. వారానికి 0.5 నుంచి .8 గ్రాములు మాత్రమే పెరుగుతుంది. రొయ్యకు మేత వేయాల్సిందే తీసుకోలేక ఎదుగుదల లోపిస్తుంది. అంటే రైతుకు ఖర్చు పెరిగి



దిగుబడి తగ్గి పోతుందని పేర్కొంటున్నారు. వైట్‌గట్ వ్యాధితో కాలేయం సరిగా పనిచేయదు. పేగు లోపలి పొర ఊడిపోతుంది. కాలేయం నుంచి తెల్లపేగు, తెల్ల రెట్టలు బయటకొస్తాయి. ఈ పరిస్థితి తలెత్తితే.. ఈహెచ్‌పీ కూడా ఉన్నట్లే భావించాలి. సాగు ప్రారంభించాక ఇది ఆశిస్తోంది. విబ్రియో బ్యాక్టీరియా, పీహెచ్ తీవ్రత పెరగడం, నీలి ఆకుపచ్చ శైవలాలు (బ్లూగ్రీన్ ఆల్గే) విడుదల చేసే విష పదార్థాలు, అమ్మోనియా, నైట్రేట్ వాయు ప్రభావం పెరగడం తదితర కారణాలతో వస్తుంది. ఆర్థిక నష్టం తీవ్రంగా ఉంటుంది. రొయ్యలు, చేపలకు సోకే వ్యాధులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు అందిస్తూ నివారణ చర్యలు సూచించాలి. కానీ రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రీ సోర్సెస్ లక్నోలో ఉంది. రాష్ట్రంలోనూ వ్యాధి నిర్ధారణ కేంద్రాలు అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలి. రైతులకు నిరంతరం సలహాలు, సూచనలు చేయాలి. నాణ్యమైన పిల్లలు ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తే పెరుగుదల బాగుండి మేత ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుందని పేర్కొంటున్నారు. రొయ్యల సాగంటే గతంలో వ్యాపారులు పెద్దమొత్తంలో అప్పులిచ్చేవారని నేడు ముందు నగదు ఇస్తేనే సీడ్ ఫీడ్ ఇస్తున్నట్లు పేర్కొంఉటన్నారు. వరస నష్టాలతో నిండా మునిగిన రైతుకు మూడేళ్లుగా అప్పు పుట్టడం లేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ఆలోచించి రైతుకు తక్కువ వడ్డీకి రుణ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. రొయ్యల సాగులో అవసరమైన అన్ని వనరులు ధరలు విపరీతంగా పెరగగా నేడు విద్యుత్ కూడ మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు మారిందని వాపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యం తీసుకువస్తున్న రొయ్యల సాగుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తగు చర్యలు తీసుకోవల్సి ఉంది.

## కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి

### గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన గురుకులం సెక్రటరీఎం.గౌతమి

**ఓజిలి, మేజర్‌న్యూస్:** విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదివి ఉన్నతశిఖరాలకు చేయాలని గురుకులం సెక్రెటరీ ఎం.గౌతమి విద్యార్థులకు సూచించారు. ఓజిలి మండలంలోని వెంకటరెడ్డి పాలెం ఏకలవ్య గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన గురుకులం సెక్రటరీ కలెక్టర్ గౌతమి. సోమవారం ఏకలవ్య గురుకుల పాఠశాలను ఆకస్మి కంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న వంట గది, స్టోర్ రూమ్ ను చూశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. నాణ్యమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తూ ముచ్చటించారు. భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థినులనడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలస్థాయి నుంచే కష్టపడి చదవడం అలవరుచుకోవాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా నిరంతరం సాధన చేయాలని సూచించారు. క్రమశిక్షణతో ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థుల స్టడీ అవర్స్ గదులనును పరిశీలించారు. గురుకుల పాఠశాలలో ఏవైనా సమస్యలుంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలో చదువులు, వసతులు, సమస్యలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. పిల్లలకు మంచి ఆహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట పలు శాఖల అధికారులు, ప్రిన్సిపల్ పవన్ కుమార్ సింగ్‌లు ఉన్నారు.



### పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఆర్జీలకు మొదటి ప్రాధాన్యతతో

# పరిష్కారం చూపాలి : కలెక్టర్

(మొదటిపేజీ తరువాయి)

వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి రెవెన్యూ అధికారి జి నరసింహులు,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, శివశంకర్ నాయక్, సుధా రాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదు చేసి అర్జీదారులకు రసీదులు అందించారు.

**శాఖల వారీగా అర్జీల వివరాలు:-** రెవెన్యూ -145, సివిల్ సప్లై -18, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-6, జాతీయ రహదారులు -3, విద్యుత్ శాఖ- 5, పంచాయతీరాజ్- 13, స్కూల్ ఎడ్యుకేషన్- 17, సర్వే శాఖ- 7, రూరల్ పావర్టీ- 5, పోలీస్ శాఖ -7, ట్రాన్స్కో -1, టూరిజం -1, పశుసంవర్ధక శాఖ -1, ఏపీఐఐసీ -1, గ్రామ వార్డు సచివాలయ శాఖ-1, ఇరిగేషన్-2, బీసీ వెల్ఫేర్- 1, సోషల్ వెల్ఫేర్-46, ఫ్యామిలీ వెల్ఫేర్ -1, మత్స్య శాఖ- 3, ఆర్టీసీ-2, రూరల్ డెవలప్మెంట్-5, వైద్య ఆరోగ్యశాఖ-1, పొల్యూషన్-2, ఎక్సైజ్ శాఖ-2, మొత్తం 296 అర్జీలు రావడం జరిగిందని సంబంధిత అధికారులు వచ్చిన అర్జీలపై దృష్టి పెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరైన వివిధ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## ట్రైబల్ గురుకులంలో సామూహిక జన్మదినోత్సవాలు

**గూడూరు, మేజర్‌న్యూస్:** ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సామూహిక పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యామసుందరరావు దాతృత్వంతో మినీ గురుకులం నందు ప్రతీ నెలా క్రమంతప్పకుండా జరిగే సామూహిక జన్మదినాలను 9మంది విద్యార్థినులకు నిర్వహించారు. మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ చదువు లేనిదే సమాజంలో గౌరవం లేదని అందుకే చేదువే మనకు ముఖ్యమని మీరందరూ ఇప్పటినుంచే ఇష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి రావానికి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మినీ గురుకులం హెడ్ మాస్టర్ మేరీ ప్రియత, ఉపాధ్యాయునులు, విద్యార్థునులు పాల్గొన్నారు.



## టీడీపీ నేతలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

**కుప్పం, మేజర్ న్యూస్:** గత వైసిపి ప్రభుత్వ హయంలో టీడీపీ నాయకులు,కార్యకర్తల పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఐదేళ్ల కాలంలో కేసులను ఎదుర్కొని ఎంతో మంది పార్టీ కోసం పోరాటం చేశారని వారందరి పై వీలైనంత త్వరగా కేసులు ఎత్తివేసి పార్టీ కోసం పోరాడిన వారికి నామినేటెడ్ పదవులలో తగిన గుర్తింపు ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులకు సోమవారం అడ్వకేట్ చంద్రశేఖర్ తో కలిసి కుప్పం తెలుగు దేశం పార్టీ నాయకులు మాజీ శాసన మండలి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, మాజీ జడ్పీటీసీ మునస్వామి, కౌన్సిలర్ జాకీర్, మంజు, చెక్కునత్తం మణి, అప్పు ముకేశ్, మునెప్ప, ఎల్లప్ప, సుబ్బు గౌడు తదితరులు చిత్తూరు జిల్లా కోర్టుకు హాజరయ్యారు.



## జూలై 4న జాబ్ మేళా

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్ సంయుక్తంగా జూలై నెల 04వ తేదిన శుక్రవారం స్థానిక పలమనేరు ఎస్‌విసిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించబడును అని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యన్. గుణశేఖర్ రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ ఇందులో 20 ప్రముఖ కంపెనీలు వారు జాబ్ మేళాలో పాల్గొంటున్నారు. కనీస విద్యార్హత పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ డిగ్రీ, బీటెక్, బి ఫామ్ అయిన 18 సం" నుండి 35 సం మధ్య వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరు కావచ్చునని తెలిపారు. ఈ జాబ్ మేళాలో రూ.1,44,500 పి ఏ నుండి రూ.3,36,000 పిఏ వరకు వేతనం అందించే అవకాశాలు ఉన్నాయి. ఈ జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8465830771, 9963561755 లోకేష్ ఫోన్ నంబర్లు సంప్రదించవలసిందిగా సూచించారు.

## మొదటి ఘాట్ రోడ్డులో ప్రమాదం.. మహిళ మృతి

**తిరుమల, మేజర్ న్యూస్:** తిరుమల నుండి తిరుపతికి వెళ్లు ఘాట్ రోడ్డులో రోడ్డు ప్రమాదం జరిగింది ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందింది. నెల్లూరు జిల్లా, బుచ్చినాయుడుపాలెంకు చెందిన సయ్యద్ అరీఫా(32) తన కొడుకు షమీర్, బంధువు సురేష్ కుమార్‌తో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనార్థం ఆదివారం ద్విచక్రవాహనంలో తిరుమలకు వచ్చారు. దర్శనం అనంతరం సోమవారం ఉదయం తిరుమల నుండి తిరుపతికి వారి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. తిరుమల నుండి తిరుపతికి వెళ్ళు మొదటి ఘాట్ రోడ్డులోని 28వ మలుపు వద్ద మంగళం డిపోకు చెందిన ఏపీ 03 జడ్0257 అను నెంబరు గల ఆర్టీసీ బస్సు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సయ్యద్ ఆరిఫా ఘటనా స్థలంలోనే మరణించడం జరిగింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఇద్దరు క్షతగాత్రులను సత్వర చికిత్స నిమిత్తం తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం ఘటనపై తిరుమల ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## శంకర గిరిజన కాలనీలో పౌర హక్కుల దినోత్సవం

**గూడూరు(చిల్లకూరు), మేజర్‌న్యూస్:** చిల్లకూరులోని శంకర గిరిజన కాలనీలో సోమవారం సాయంత్రం తాసిల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసిల్దార్ పౌర హక్కులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఇల్లు లేని పేదలకు త్వరలోనే ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఆధార్ కార్డులు లేనివారికి ఆధార్లను అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని చక్కగా చదివించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ పూర్ణ, మాజీ సర్పంచ్ నెల్లూరు రామ్మూర్తి, హౌసింగ్ ఏఈ షబ్బీర్, సోషల్ వెల్ఫేర్ పద్మజ, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ లైన్ మెన్ మల్లి కార్జున, హెల్త్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ రవికుమార్ పాల్గొన్నారు.



## రాజనేని ప్రతిభ విద్యార్థులకు సన్మానం

**గూడూరు (చిల్లకూరు), మేజర్‌న్యూస్:** మండలంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్మ ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కరాలు అందచేశారు. సోమవారం మండలంలోని తిక్కవరం జడ్పీ హైస్కూల్లో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో మండలంలో 500 పైగా మార్కులు సాధించిన 27 మంది విద్యార్థిని, విద్యార్థులకు మొదటి బహుమతిగా నెలబల్లి రెట్టుపల్లి హైస్కూల్ విద్యార్థి ఎం. శేఖర్‌కు 20వేల రూపాయలు, రెండవ బహుమతిగా వరగలి హైస్కూల్‌కు చెందిన పి.పురుషోత్తంకు రూ.10వేలు, మూడవ బహుమతిగా ఎన్ఆర్ పల్లి హైస్కూల్‌కు చెందిన పి.నవీన్‌కుమార్ రూ.10వేలును, అలాగే మిగిలిన విద్యార్థుల ఒక్కొక్క రికి రూ.5వేలు వంతున అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ జీవితాలను ఉన్నత స్థాయికి చేరుకోవడానికి లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని తెలియజేశారు. విద్యకు పేదరికం ఎప్పుడు అడ్డుకాదని, లక్ష సాధనలో అనేక అవాంతరాలు ఎదురైనప్పటికీ వాటిని అధిగ మించి లక్ష్యాన్ని చేదించాలని, విద్యార్థులకు విద్యను, పేదవారికి వైద్య సహాయం అందించడంలో మా ట్రస్ట్ ఎప్పుడు ఉందంటుందని తెలిపారు. అనంతరం మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఆయన్ను ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు అర్బన్ విద్యాశాఖ అధికారి అబ్దుల్ హమీద్, ట్రస్ట్ కార్యదర్శి రామయ్య నాయుడు, తిక్కవరం, చింతవరం, కడివేడు, రెట్టపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.రమణయ్య, శివ సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, విజయలక్ష్మి, చంద్రశేఖర్, పివి కృష్ణారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.



## రైవెన్యూ సమస్యలపై తక్షణం స్పందించండి : ఎమ్మెల్యే

**గూడూరు, మేజర్‌న్యూస్:** రెవెన్యూ సమస్యలపై కాలయాపన చేయకుండా తక్షణం చర్యలు తీసుకునే విధంగా ఉండాలని ఎంఎల్ఏ డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిల్లకూరులో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమస్యలతో వచ్చే పేదలకు అవుతుందో కాదో నిర్ణయించి వెంటనే తగు సమాచారం ఇవ్వాలని తిప్పు కోవద్దని సూచించారు. గ్రామాల్లో పార్టీ నాయకులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కారం చూపేందుకు కృషి చేయాలన్నారు. ఇంకా ఈ సమావేశంలో తానంకి నానాజి, తహసిల్దార్ శ్రీనివాసులు, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు దశరథరామిరెడ్డి, అన్ని గ్రామల నుంచి నాయకులు వీఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.



## జెమీన్ కొత్తపాలెం గ్రామంలో సివిల్ రైట్స్ డే



**వాకాడు, మేజర్‌న్యూస్:** వాకాడు మండలం జెమీన్ కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజనవాడలో సోమవారం తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పౌర హక్కుల గురించి వివరించారు, అలాగే ప్రతి ఒక్కరు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలన్నారు, ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ సమానత్వం స్వేచ్ఛ, పౌరుహక్కుల గురించి వివావరించారు. ఈ సమావేశంలో ఏవో దీప, ఏపిఓ విజయమ్మ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దయాసాగర్ రెడ్డిని పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం

**పెనుమూరు, మేజర్‌న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్ రెడ్డి నీ సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, కుమార్తె కృపా లక్ష్మి, మండల వైఎస్సార్సీపీ నాయకులు ఆయనను పరామర్శించారు. గత కొన్ని రోజుల క్రితం దయాసాగర్ రెడ్డికి మోకాళ్ళ మార్పిడి శాస్త్ర చికిత్స జరిగింది. విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పెనుమూరు మండలం పులికల్లు గ్రామంలో దయాసాగర్‌రెడ్డి నివాసంలో ఆయనను పరామర్శించారు. ఆయన కలియుగ దేవుడు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో త్వరలోనే ఆరోగ్య వంతులుగా కోలుకుంటారని ఆయన ఆకాంక్షించారు. అనంతరం దయాసాగర్ రెడ్డి తల్లి ప్రమీల మన్ను కూడా మన పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల కన్వీనర్ హేమలత సురేష్ రెడ్డి, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యుడు దూది మోహన్, పెనుమూరు మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ కామసాని విజయ్ కుమార్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, జ్యోతి రెడ్డి, ఉమాపతి, అనిల్ కుమార్ రెడ్డి తదితర వైకాపా నాయకులు పాల్గొన్నారు.



## నేడు కుప్పం రానున్న సీఎం చంద్రబాబు : జిల్లా కలెక్టర్



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా జూలై 01, 02 తేదీలలో కుప్పంలో పర్యటించను న్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన లో భాగంగా జూలై 01 వ తేది మంగళవారం సా.5.20 గం.లకు శాంతిపురం మండలం తుమ్మిసి నందు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని సా.5.35 గం.లకు కడపల్లెలోని స్వగృహం చేరుకుంటారు. పర్యటనలో రెండవ రోజైన జూలై 02 వ తేది బుధవారం ఉ.8.00 గం.లకు శాంతిపురం మండలం తిమ్మరాజు పల్లె గ్రామం చేరుకుని ఇంటింటి పర్యటన లో పాల్గొంటారని, అనంతరం ఉ.10.50 గం.లకు శాంతిపురం మండలం తుమ్మిసిలోని ఏపి మోడెల్ స్కూల్ చేరుకుని పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమలలో పాల్గొని బహిరంగ సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమంలో తదుపరి మ.1.55 గం.లకు కడపల్లి స్వగృహం చేరుకుని, మ.3.05 గం.లకు కుప్పం ఏరియా ఆసుపత్రి చేరుకుని టాటా సంస్థ ద్వారా డిజిటల్ నెర్వ్ సెంటర్ ను ప్రారంభించి సా.4.20 గం.లకు తుమ్మిసి హెలిప్యాడ్ చేరుకుని బెంగళూరు తిరుగు ప్రయాణం అవుతారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### వృత్తి నైపుణ్య శ్రీవారి సేవకులకు
## ప్రత్యేక అప్లికేషన్ టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

**తిరుమల, మేజర్‌న్యూస్:** వృత్తి నైపుణ్య శ్రీవారి సేవకుల కోసం నెల రోజుల్లో ప్రత్యేక అప్లికేషన్ రూపొందించనున్నట్లు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని అన్నమయ్య భవన్ లో సోమవారం వృత్తి నిపుణుల శ్రీవారి సేవపై జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ



సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తి నిపుణులను శ్రీవారి సేవ ద్వారా టీటీడీలో ముఖ్యమైన 10 విభాగాల్లో వారి సేవలను ఉపయోగించుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సాంకేతిక విభాగాల్లో కూడా సాంకేతిక నిపుణుల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించామని చెప్పారు. ప్రతి విభాగంలో అవసరాన్ని బట్టి శ్రీవారి సేవ ద్వారా వృత్తి నైపుణ్య సేవకుల సేవలను వినియోగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తి నిపుణుల సేవలను వినియోగించుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలన్నారు. ముందుగా ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టి, తర్వాత పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. త్వరలోనే దీనిపై నిర్దిష్ట విధానాన్ని రూపొందించి సుస్థిర వ్యవస్థగా మార్చేందుకు కృషి చేయాలని ఆయన సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, సీఈ సత్య నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి : మేయర్ అముద

**చిత్తూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్:** పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి మేయర్ ఎస్ అముద చెప్పారు. చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ చెందిన నలుగురు పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం సోమవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. పదవీ విరమణ తర్వాత సంతోషంగా, ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చెందిన యం.గంగరాజు, పి.యశోదమ్మ, యు.సుజాత, కె.విజయమ్మలను పూలమాల, శాలువలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా పి. లోకేష్, ఏఐటీయూసీ నాయకులు నాగరాజ్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

### శ్రీవారిని దర్శించుకున్న
## పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపి విరామ సమయంలో సినీ నటుడు మాధవన్., సినీ గాయకుడు రాహుల్ లు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.





### రేపు శ్రీగోవిందరాజస్వామివారి
## ఆలయంలో పుష్పయాగం

– నేడు అంకురార్పణ

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయంలో జూలై 02న పుష్పయాగం వైభవంగా జరుగనుంది. ఇందుకోసం జూలై 01వ తేదీ సాయంత్రం 5.30 – 8.30 గం.ల వరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం నిర్వహిస్తారు. జూలై 02వ ఉదయం 09.30 – 11.30 గం.ల వరకు శ్రీ భూ సమేత గోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం ఘనంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 01 – 04 గం.ల వరకు పుష్పయాగం వైభవంగా నిర్వహించనున్నారు. పుష్పయాగంలో వివిధ రకాల పుష్పాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారికి విశేషంగా అభిషేకం చేస్తారు. జూన్ 02 నుంచి 10 వరకు శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం విదితమే. ఈ ఉత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల తెలిసీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం 6.00 నుండి 7.30 గంటల వరకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. గృహస్తులు(ఇద్దరు) రూ.516/– చెల్లించి ఈ యాగంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక రవికె, ఉత్తరీయం బహుమానంగా అందజేస్తారు. వార్షిక పుష్పయాగం సందర్భంగా జూలై 01, 02 తేదీల్లో ఊంజల్ సేవను రద్దు చేశారు.

## ఆంధ్రప్రదేశ్ క్వాంటమ్ లీప్‌లో యస్వీయూ చేరిక

**తిరుపతిఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడ లోని హోటల్ నోవోటెల్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక"అమరావతి క్వాంటమ్ వ్యాలీ"వర్క్‌షాప్‌లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పాల్గొంది. అమరావతిని భారతదేశ క్వాంటమ్ వ్యాలీగా, తదుపరి తరం క్వాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతను నెరవేర్చడంలో ఈ కార్యక్రమం కీలకమైన అడుగు. ఎస్వీయూ వైస్–ఛాన్సలర్ (ఐ/సి) ఆచార్య సిహెచ్.అప్పారావు, క్వాంటం కంప్యూటింగ్, కంప్యూటర్ సైన్స్, గణితం, భౌతిక శాస్త్రం వంటి కీలక డొమైన్‌లను సూచించే ఎంపిక చేసిన అధ్యాపక సభ్యులతో పాటు వీరు కూడా వర్క్‌షాప్‌కు హాజర య్యారు. ఈ వర్క్‌షాప్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వైస్–ఛాన్సలర్లు, పరిశోధకులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమ నాయకులను ఒకచోట చేర్చింది. ఉన్నత విద్యా శాఖ అండ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆదేశాల మేరకు, సంబంధిత విభాగాల నుండి అధ్యాపక సభ్యులను హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ మేరకు ఎస్వీయూ నుండి ఆచార్య సుబ్బారావు, డాక్టర్ ఉషా రాణి, ఆచార్య జయ సుబ్బారెడ్డి, డాక్టర్ హేమలత రుద్రమదేవి, ఆచార్య అంజన్ బాబు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్ సందర్భంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత నిపుణులు క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, క్రిప్టోగ్రఫీ, క్వాంటం, కృత్రిమ మేధ తాజా ధోరణులపై వివరించారు. క్వాంటం టెక్నాలజీలు కంప్యూటింగ్, డేటా భద్రత, మెటీరియల్ సైన్సెస్,



ఆవిష్కరణల భవిష్యత్తును ఎలా పునర్నిర్మిస్తాయో ఈ కార్యక్రమం హైలైట్ చేసింది. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం నుండి ఇంజనీరింగ్‌తో సహా ఎంపిక చేసిన అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో క్వాంటం కంప్యూటింగ్‌ను మైనర్ సబ్జెక్టుగా ప్రవేశపెట్టే ప్రక్రియను ప్రారంభించిందని, మన విద్యార్థులు క్వాంటం భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని, విశ్వవిద్యాలయం ఆ దిశలో దృఢమైన అడుగులు వేస్తోందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఊహించిన క్వాంటం విప్లవం, విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వ్యూహాత్మక అమలు ద్వారా శక్తివంతం కావడం వల్ల ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో సాంకేతిక రంగంలో అగ్రగామిగా మారడమే కాకుండా, క్వాంటం సైన్స్‌లో అమరావతిని ప్రపంచ శక్తి కేంద్రంగా నిలబెట్టగలదని ఆచార్య అప్పారావు ఆశాభావం వ్యక్తం చేశారు.

### శ్రీ శక్తి పీఠంలో శ్రీ పాతాళ శ్వేత
## వారాహి దేవిగా భక్తులకు దర్శనం

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** మండలం లోని రాయల చెరువు లో వెలసియున్న శ్రీ శక్తి పీఠం నందు సోమవారం శ్రీ వారాహి దేవి నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కుర్తాళం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి దివ్య సమ క్షంలో మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాధిపతి మాతాజీ శ్రీ శ్రీ శ్రీ రమ్యానంద భారతి స్వామిని వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగు తున్నాయి. ఉదయం పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, శ్రీ స్వప్న వారాహి దేవి మంత్ర హోమాలు నిర్వహించారు. జగద్గురువుల దివ్య సమక్షంలో పూజ శ్రీ మాతాజీ వారిచే శ్రీ పాతాళ శ్వేత వారాహి దేవికి దర్బారు సేవా నిర్వహించారు. ఐదవ రోజు సుమారు 6000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కు లు తీర్చుకున్నారు. శ్రీ పాతాళ శ్వేత వారాహి దేవి సేవలో పాల్గొన్న తిరుపతి ఐదవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి శ్రీ రామ గోపాల్ దంపతులు పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ఆలయానికి వచ్చిన భక్తులందరికీ అన్నా ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో శ్రీ శక్తిపీఠం ఆలయ వ్యవస్థాపకులు జగద్గురు వులు భక్తులు పాల్గొన్నారు.





# చంద్రగిరి క్రీడా వికాస్ కేంద్రానికి రూ.1.53 కోట్ల నిధులు మంజూరు

**-పునః నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని...**



**చంద్రగిరి, మేజర్ న్యూస్:** ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. చంద్రగిరి మండలంలోని బాలుర ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇండోర్ స్టేడియం పునఃనిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పులివర్తి నానికి శాప్ చైర్మన్ రవి నాయుడు శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. శాప్ బోర్డు సభ్యురాలు రజనీ, ప్రధానోపాధ్యాయులు, అధికారులు, కూటమి నాయకులు తదితరులు ఘన స్వాగతం పలికారు. ఎన్సీసీ విద్యార్థులు ఎమ్మెల్యే కు సెల్యూట్ చేస్తూ మార్చ్ ఫాస్ట్ తో గౌరవంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పేరుపేరునా పలకరిస్తూ ముందుకు సాగారు. ముందుగా శ్రీ మహాగణపతి శ్లోకంతో సభను ప్రారంభించారు. సభా ప్రాంగణానికి చేరుకున్న అతిథులు ఒక్కొక్కరుగా సభను ఉద్దేశించి ప్రసంగించారు. శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ 2014-19 లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి నియోజకవర్గానికి క్రీడా వికాస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో చంద్రగిరి పట్టణం బాయ్స్ కళాశాలలో క్రీడా వికాస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేను శాప్ చైర్మన్ అయిన వెంటనే నాని అన్న చంద్రగిరిలోని క్రీడా వికాస్ కేంద్రాన్ని పునః నిర్మాణానికి సహకరించాలని తెలిపారు. నాని అన్న పట్టుదల వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఈ స్టేడియం పునర్నిర్మాణానికి రూ.1.53 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సభను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి పేరుపేరునా నమస్కారాలు తెలియజేశారు. నా విజయంలో భాగస్వాములైన టీచర్లు, పీఈటీ లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2014- 19 సంవత్సరములో మా పెద్దాయన చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు క్రీడా వికాస్ కేంద్రాన్ని మొదటిసారి ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అయితే గత పదేళ్ల వైసీపీ పాలనలో ఇది శిథిలావస్థకు చేరుకుందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోని ఈ స్టేడియం, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు మంజూరు చేసి పునరుద్ధరిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిధులు మూడు నెలల ముందే మంజూరైనప్పటికీ, నాణ్యతతో, వేగంగా పనులు చేసే కాంట్రాక్టర్ కోసం ఆలస్యం అయిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఏడాదిలో 937 అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మా పెద్దాయన చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూచనల మేరకు అధికారులతో సమన్వయం, ప్రజల సమస్యలపై స్పందనకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రసంగం అనంతరం అధికారులు నాయకులతో కలిసి క్రీడా వికాస్ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, కాంట్రాక్టర్‌ను తక్షణమే పనులు ప్రారంభించి నాణ్యతతో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ అభివృద్ధి కార్యక్రమానికి ఉపాధ్యాయులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ఇతరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించొద్దు

**- నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని, ప్రజల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరించరాదని నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ నగరపాలక ఇంజనీరింగ్ విభాగం ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులకు స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులతో సోమవారం కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల హక్కులకు భంగం కలిగించే అధికారం ఎవరికీ లేదని ప్రాథమిక అవసరాలైన నీటి సరఫరా, వీధి దీపాలు వంటి సౌకర్యాలను నిలుపుదల చేసే చర్యలను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. చట్టపరంగా చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అసౌకర్యం కలగని రీతిలో నిరసన తెలుపవచ్చు అని, ప్రజల హక్కులకు భంగం కలిగించని ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇదే సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిత్తూరు 1వ పట్టణ సీఐ మహేశ్వర్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏఈ లోకేష్, ఇంజనీరింగ్ విభాగం కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 47 వినతులు : కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 47 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 16 మంది తమ సమస్యలు తెలపగా, 31 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఎస్టీవీ నగర్ నందు కొత్త కాలువలు, రోడ్లు వేయాలని, 12,13,14 డివిజన్లలో పాడైన భూగర్భ డ్రైనేజీ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని, వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ లు కోరారు. నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, భవానీ నగర్ నందు, సాయి విష్ణు లే అవుట్ నందు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సుందరయ్య నగర్ లో డ్రైనేజీ కాలువ తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, కపిలతీర్థం పెద్ద కాలువ శుభ్రం చేయించాలని, గాంధీ రోడ్ నందు రోడ్డు తవ్వి వదిలేశారని, చిరు వ్యాపారులు ఆక్రమణ చేసి వ్యాపారులు చేస్తున్నారు పరిష్కరించాలని, భారతి బస్టాండ్ వేలంలో టెండర్ దక్కించుకున్న ఇంకా ఇవ్వలేదని, గొల్లవాని గుంట వద్ద వ్యవసాయ భూములు ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, నూతనంగా అప్‌గ్రేడ్ చేసిన స్కూళ్లలో కంటింజెంట్ వర్కర్స్ నియమించాలని, ఫుట్ పాత్ పై విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలని, గొల్లవాని గుంట నందు రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలను విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డి.ఈ.లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.



# ఇంటింటికీ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం : ఎమ్మెల్యే అమర్

**- 2న వి.కోట నుంచి ప్రారంభం**



**పలమనేరు మేజర్ న్యూస్:** ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశ్యంతో చేపట్టదలచిన ఇంటింటికి తెలుగు దేశం కార్యక్రమాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం సమన్వయ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇప్పటి వరకు ప్రజలకు చేసిన సంక్షేమం అభివృద్ధి పై గ్రామ స్థాయిలోని ప్రజలకు తెలియజేయడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందుకోసం (కేఎస్ఎస్) కుటుంబ సాధికారిక సభ్యులుగా ఉన్న వారు బాధ్యత తీసుకొని పార్టీ రూపొందించిన ఫార్మట్ ప్రకారం వివరాలను పొందు పరచాల్సి ఉంటుందన్నారు. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లాలన్నదే ముఖ్యమంత్రి ప్రధాన లక్ష్యం. కాబట్టి పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికి సంక్షేమ ఫలాలు తప్పక అందేలా చూడాలన్నారు. బూత్ లెవల్ స్థాయిలో కనీసం రోజుకు 50 కుటుంబాలకు తగ్గకుండా ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమం నియోజకవర్గంలోని వి. కోట మండలంలోని కొంగాటం పంచాయతీ నుంచి ఈ నెల 2 న ప్రారంభించి ఏక కాలంలో అన్ని మండలాల్లో విజయవంతంగా సాగేలా చూడాలని కోరారు. అనంతరం కార్యక్రమ కార్యాచరణ పై నాయకులతో ఆయన చర్చించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు ఆర్వీ బాలాజీ,విజయ భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ,సోమశేఖర్ గౌడ్, ఆనంద,నాగరాజు రెడ్డి, కుట్టి,నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్,రాంబాబు, గిరి, ప్రతాప్, బ్రహ్మయ్య, భాజా, నాగరాజు, చౌడప్ప, చాంద్ భాషా, జగదీష్ నాయుడు, సుధాకర్, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# మా భూమి కబ్జా చేశారని కుంట్ర పాకం దళితుల నిరసన

తిరుపతి రెవిన్యూ, మేజర్‌న్యూస్: వివరాలు సర్వే నంబర్ 268/1 కుంట్రపాకం రెవెన్యూ లెక్క దాఖల తిరుపతి రూరల్ మండలం తిరుపతి జిల్లా నందు 40 సెంట్లు భూమి తోటిమాన్యంగా 1958 పేరదగల నందు 14 మంది కుంట్ర పాకం దళితులకు ఇవ్వడమైనది. అందులో 20 సెంట్లు వారి అవసరానికి సంబంధించి 1965 మరియు 67 సంవత్సరం మధ్యలో అమ్మకం జరిగినది. మిగిలిన 20 సెంట్ల భూమి వారి ఆధీనంలో ఉండి వ్యవసాయం చేసుకుంటూ ఉండేవారు, తరువాత గ్రామీణ ప్రాంతంలో నీటి ఎద్దడి ఇతర కారణాల చేత వ్యవసాయం చేసుకోకుండా పశువులను కట్టే పాకగా, పెడ దిబ్బగా వారు వాడుకుంటూ ఉన్నారు. క్రమంలో శ్రీకర హోమ్ డెవలపర్స్ మేనేజింగ్ పార్ట్నర్ అయిన మిట్టపాలెం శంకర్‌రెడ్డి మిట్టపాలెం శ్రీనివాసులు రెడ్డి, మిట్టపాలెం నాగమణి రెడ్డి అందరూ కలిసి సర్వే నంబర్ 284,287, 288 , ప్రక్కలున్నటువంటి సర్వే నంబర్లతో కలిపి సుమారు ఆరు ఎకరాల ఇంటి ప్లాట్లను అమ్మే వెంచర్ ప్రారంభించారు. ఆ వెంచర్ కి సంబంధించి ప్రధాన దారి కావలసిన పరిస్థితిలో వారు పై చెప్పబడిన 20 సెంట్లు తోటిమాన్యం భూమిని, తప్పుడు రికార్డు సృష్టించి వాటి ద్వారా తిరుచానూరు పోలీస్ వారిని వారికి అనుకూలంగా చేసుకుని ఆ యొక్క భూమిని వెంచర్ రోడ్డుకి నిర్మాణ పనులు చేసుకున్నారు. ఈ పనులను సదరు తోటిమాన్యం వారసులు అడ్డుకుంటే వారి యందు తిరుచానూరు సిఐ అనుచితంగా ప్రవర్తించి భయభ్రాంతులకు గురిచేసి వారిని అక్కడికి రాకుండా చేసి సదరు ప్రతివాదులకు సహకరించడం జరిగినది. ఈ విషయాన్ని చంద్రగిరి డిఎస్పీ బాధితులు ఫిర్యాదు చేసిన ఆయన సూచనలు కూడా పరిగణలోకి తీసుకోకుండా సదరు సిఐ నడుచుకున్నారు. తరువాత బాధితులు అడిషనల్ ఎస్పీ లా అండ్ ఆర్డర్ శ్రీ రవి మనోహర్ కలిసి 26 .6.25 వారి బాధలను చెప్పుకోవడం జరిగినది. ఇక చేసేది లేకుండా సోమవారం బాధితులందరూ ఎస్పీ కార్యాలయం వద్ద నిరసనకు తెలియజేస్తూ పోలీస్ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. అటు తరువాత ఎ.ఎస్.పి చొరవ తీసుకొని సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం వలన వారు వెనుదిరిగి తిరుపతి రూరల్ మండలం ఎమ్మార్వోని సర్వే చేసి నిందితులపైన కఠినమైనటువంటి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అక్కడ కూడా నిరసన తెలియజేసి వారి డిమాండ్లను అడగడమైనది.




# ఉద్యోగ నిర్వహణలో రాజీపడద్దు : డిఐఈఓ

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** ఉద్యోగ నిర్వహణలో రాజీ పడకండని డి ఐ ఈ ఓ డాక్టర్ ఆరూరు శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఇన్చార్జి ఆర్ డి జేడీగా ఉంటూ చిత్తూరు జిల్లా డిఐఈఓ గా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం పదవీ విరమణ పొందిన నేపథ్యంలో ప్రభుత్వ కళాశాల, ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో చిత్తూరు నగరం లోని స్థానిక మిట్టూరు నందుగల ఆర్కే కళాశాలలో ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఆర్ఐఓ వరప్రసాద్, మాట్లాడుతూ డీఐ ఈఓ శ్రీనివాసులు అందించిన సేవలు కొనియాడారు. డి ఐ ఈ ఓ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పదవి విరమణ పొందిన తమ వంతు సలహాలు సూచనలు ఇవ్వడానికి ఎప్పుడు ముందుంటానని తెలిపారు. చిత్తూరు జిల్లాలో పనిచేయడం ఇక్కడే పదవి విరమణ ఇక్కడ చూపిన ప్రేమ అభిమానాలు మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్కే కళాశాల ప్రిన్సి పాల్ రమేష్ బాబు, బాల సుబ్రమ ణ్యం, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ దయానంద రాజు, నిర్మలకుమారి తదితరులు పాల్గొన్నారు.



## సూర్య కార్టూనిస్ట్ నారుకు సన్మానం



**తిరుపతి, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన సూర్య తెలుగు జాతీయ దినపత్రిక కార్టూనిస్ట్ నారును తిరుపతిలో రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో ఘనంగా సత్కరించారు. కార్టూనిస్టు నారు తమ కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరుపతిలో ఏపీ రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నాయి బ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన ప్రముఖ న్యాయవాది రామనాథం, నాయి బ్రాహ్మణ సంఘం నేతలు నారుతో నాయి బ్రాహ్మణుల అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు.

## ఉమ్మడి జిల్లాల ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల డీసీఓగా పద్మజ



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల డీసీఓగా బాధ్యతలు స్వీకరించి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌ని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. టి పద్మజ, గతంలో నెల్లూరు జిల్లా డీసీఓగా పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాకు బదిలీపై వచ్చారు.

## యువతి ఆత్మహత్య



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణ పరిధిలోని సుబేదార్ వీధికి చెందిన యువతి సోమవారం ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే సుబేదారి వీధి నందు కాపురం ఉండు లేట్ వల్లి భాష కుమార్తె హసీనా ( జైనాబ్) (19) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని మరణించింది పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్నిప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉచిత ఈ క్వాలిటీ ఆరోగ్య సేవలకు ప్రజలందరూ అభ ఐడి క్రియేట్ చేసుకోవాలి



**కుప్పం,మేజర్ న్యూస్:** కుప్పం నియోజకవర్గం నందు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డిటి సుధారాణి, ప్రత్యేకంగా ప్రజల ఆరోగ్య నిమిత్తమై టాటా గ్రూప్ ఏర్పాటు చేసిన డిజిటల్ నర్స్ సిస్టం యొక్క పనితీరును స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శ్రీ వీరపాండ్యన్ సోమవారం కుప్పం నియోజకవర్గంలోని విజలాపురం పిహెచ్సి నందు డిజిటల్ నర్స్ సిస్టం యొక్క పనితీరును విపులంగా పరిశీలించారు. దీని ద్వారా ప్రజలకు ఏ విధంగా వైద్య సౌకర్యాలు క్వాలిటీగా అందుతాయి అనేదానిపై ప్రత్యక్షంగా పరిశీలించారు. కావున ప్రజలందరూ అభ ఐడి క్రియేట్ చేసుకుని ఈ క్వాలిటీ ఆరోగ్య సేవలను ఉచితంగా పొందవలెనని తెలిపారు. దీని ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు బిపి, షుగర్, గుండెజబ్బులు, క్యాన్సర్లు ,థైరాయిడ్ లాంటివి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ దేవి, డీయెన్సీ ఐటీ మేనేజర్, డి సి హెచ్ ఎస్ డాక్టర్ పద్మాంజలి, స్థానిక డాక్టర్ పూజిత తదితరులు పాల్గొన్నారు.

## లలిత శివజ్యోతికి డాక్టరేట్



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యూజిక్, డాన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ పరిశోధక విద్యార్థిని లలిత శివజ్యోతి డాక్టరేట్ అందుకున్నారు."క్రిటికల్ స్టడీ ఆఫ్ ది కాంపోజిషన్ ఆఫ్ శ్రీ యోగి నారాయణస్వామి"అన్న అంశంపై ఆచార్య ద్వారం లక్ష్మి పర్యవేక్షణలో పరిశోధనా సిద్ధాంత వ్యాసం సమర్పించినందుకు గాను పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోమవారం ఆమెకు డాక్టరేట్ ను ప్రకటించారు.

## జిల్లా కోర్టుకు హాజరైన తెలుగు తమ్ముళ్లు



కుప్పం,మేజర్ న్యూస్ : చిత్తూరు జిల్లా న్యాయస్థానం నందు కుప్పం తెలుగు తమ్ముళు సోమవారం నాడు హాజరయ్యారు. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి మాట్లాడుతూ గత వైసిపి హయాంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ప్రజా సమస్యలపై పోరాటం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో కుప్పం శాసనసభ్యులుగా బాబు సొంత నియోజకవర్గ పర్యటనను సైతం ఆనాటి అధికార పార్టీ అడ్డుకోవడం జరిగిందన్నారు. ఆనాటి అధికార పార్టీ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడినందుకు నియోజకవర్గంలోని ముఖ్య నాయకుల పై తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసినట్టు తెలిపారు. అయితే చట్టాల పై నమ్మకంతో న్యాయస్థానానికి హాజరవుతున్నట్టు తెలిపారు. త్వరలో తమకు న్యాయం జరుగుతుందన్న దృఢ సంకల్పం వ్యక్తపరిచారు. దేవస్థానానికి హాజరు అయిన వారిలో మాజీ శాసన మండలి సభ్యులు గౌనివారి శ్రీనివాసులు, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, మాజీ జడ్పీటీసీ మునస్వామి, నాయకులు జాకీర్, మంజు, ముకేశ్, మునెప్ప, తదితరులు ఉన్నారు.

# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష

**- ఒక్కొక్కరికి రూ.6లక్షల జరిమానా**

**- తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి**

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 27/2016 కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టయ్యారు. వీరు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన జె. దామోదరం, ఏ. హరిప్రసాద్ కాగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ చంద్రగిరి మండలం, పాండురంగాపురి పల్లి ప్రాంతంలో పట్టుబడ్డారు. వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.

## ఈసెట్ కౌన్సిలింగ్‌పై జగన్ ఎక్స్ ప్రకటన హాస్యాస్పదం

**- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు**



**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** ఈసెట్ కౌన్సిలింగ్ పై మాజీ సిఎం జగన్ ఎక్స్ ప్రకటన హాస్యాస్పదం అని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు త్యాగరాజు మాట్లాడుతూ గతంలో ఈసెట్ కౌన్సెలింగ్ ఎప్పుడు నిర్వహించారో జగన్ కు తెలియదు వైసీపీ హయాంలో ఈసెట్ కౌన్సెలింగ్ 2022లో సెప్టెంబరులో జరిగింది. 2023లో జులై ఆఖరుకు కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఈ సంవత్సరం జులై మూడో వారంలోపు ఈసెట్ కౌన్సెలింగ్ పూర్తిచేస్తామని ఇదివరకే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు చెప్పడం జరిగిందని, వైసిపి పాలనలో విద్యారంగం నాశనమైందని, జగన్ అస్తవ్యస్తం చేసిన విద్యా వ్యవస్థను గాడిన పెడుతున్నాం అని తెలియజేశారు. ఈ సమావేశంలో చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సి ఆర్ రాజన్, డిసిసిబి చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ జయచంద్ర నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభ తేజ, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు ఉపాధ్యక్షులు గోకుల్ చిత్తూరు టౌన్ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

## పరిమితికి మించి స్కూల్ విద్యార్థుల తరలిస్తున్న ఐదు ఆటోల స్వాధీనం



**తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్:** జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ ఆదేశాల మేరకు విద్యార్థులను తరలిస్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. అలిపిరి వద్ద భారతీయ విద్యా భవన్ పాఠశాల నందు స్కూల్ విద్యార్థులు తరలిస్తున్న ఆటోల డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మోటారు వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్ కుమార్ తెలియజేశారు. వాహనాలు అధికమైన వేగంతో వెళ్లరాదని పరిమితికి మించి విద్యార్థులను తీసుకు వెళ్లే ఆటోలపై తనిఖీలు ముమ్మరం చేస్తామని తెలియజేశారు.ముత్యాల రెడ్డి కూడలి వద్ద మోటార్ వాహన తనిఖీ అధికారి అతికానాజ్ స్కూల్ విద్యార్థులు తరలించు ఆటోలపై ఐదు కేసులు నమోదు చేయడం జరిగింది వాహన సామర్ధ్య ధ్రువీకరణ పత్రం అధిక పరిమితికి మించిన విద్యార్థులతో వెళ్లే వాహనాలపై వాహన తనిఖీ రసీదులు నమోదు చేయడం జరిగింది. తల్లిదండ్రులు విద్యార్థులను పాఠశాలకు ఆటోలో పంపేటప్పుడు సురక్షిత అంశాలపై శ్రద్ధ వహించాలని అలాగే పాఠశాల యాజమాన్యం కూడా డ్రైవర్లకు తగు జాగ్రత్తలు సూచనలు ఇవ్వాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశించారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి సన్నిధిలో ప్రముఖ జ్యోతిష్యులువేణు గోపాలస్వామి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు విచ్చేసిన ప్రముఖ జ్యోతిష్యులు వేణుగోపాలస్వామి కుటుంబ సభ్యులు వారిని మన్నేపల్లి ఈశ్వర్, సంపత్ కుమార్ స్వాగతం పలికి శ్రీకాళహస్తీశ్వర స్వామి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం శ్రీ మృత్యుంజయ సన్నిధానం వద్ద వేద పండితులు చేత ఆశీర్వచనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## యువతి అదృశ్యంపై కేసు నమోదు



**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలో దిన్నిపల్లి గ్రామ నివాసి రెడ్డప్ప కుమార్తె వీర వైష్ణవి(19) ఈనెల 21వ తేదీ నుంచి కనిపించలేదని తన కుమార్తె వీరవైష్ణవి కోసం బంధువులు మరియు స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం యువతి తండ్రి పెద్దపంజాణి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపంజాణి ఎస్సై ధనంజయ రెడ్డి తెలిపారు.

## నూతన తహసీల్దార్‌గా హరికృష్ణ



పెళ్లకూరు, మేజర్‌న్యూస్: మండల తహసీల్దార్‌గా హరికృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి ఆయన బదిలీపై పెళ్లకూరుకి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ద్వారకానాద్ రెడ్డి కలెక్టరేట్‌కు బదిలీఅయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అనంతరం రెవెన్యూ సిబ్బంది నూతన తహసీల్దార్ కు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యువరాజు,మండల సర్వేయర్ పూజిత, గ్రామ రెవెన్యూ అధికారులు సుధాకర్,తేజ,రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుల స్థావరాలపై ఆకస్మిక దాడులు

కేవిబిపురం మేజర్‌న్యూస్: మండలంలోని సూరమాల గ్రామంలో చాలా రోజులుగా పేకాట రాయుళ్లు ఇచ్చలవిడిగా చెలరేగిపోతున్నారు. కొందరు పేకాట కు బానిసలై అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొని పేకాట ఆడుతూ మద్యం మత్తులో వాళ్ళ కుటుంబాలను అనాధలు చేస్తున్నారు. ఇదే గ్రామంలో వాలేటి మునిరత్నం అనే వ్యక్తి ఈ పేకాటను నిర్వహిస్తూ డబ్బులు వసూలు చేస్తూ నడిపిస్తున్నాడు. చాలా రోజులుగా మాటు వేసి దీన్ని సమాచారం అందుకున్న కే వి బి పురం ఎస్ఐ చాకచక్యంతో పేకాట స్థావరంపై తనిఖీ చేసి 10 మంది వ్యక్తులు తొమ్మిది బైకులు ఒక ఆటో 21,950 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఇలాంటి చర్యలు కు ఎవరైనా పాల్పడితే వెంటనే సమాచారం తెలపాలని వెంటనే చర్యలు తీసుకుం టామని వారి వివరాలు గోప్యంగా ఉంచు తామని గ్రామ స్తులకు తెలియ జేశారు.



## ఏపీ మండలి రెండు రోజుల రిజిస్ట్రేషన్ విజయవంతం



**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా జరుగు తున్న ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి రిజిస్ట్రేషన్ ఆదివారం రాత్రి 9 గంటలకు వరకు ఈ ప్రక్రియ దిగ్విజయంగా కొనసాగిం దని, తిరు పతి పరిసరాల ప్రాంతాల డాక్టర్లు విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అని ఆంధ్రప్రదేశ్ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గు మాటి శ్రీహరి రావు ఈ సందర్భంగా తెలిపారు. మొత్తం డాక్టర్లు 650 మంది రిజిస్ట్రేషన్, రీ -రిజిస్ట్రేషన్, ఎన్ఓసిలు, నూతన రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వయోవృద్ధుల డాక్టర్లు ఈ ప్రక్రియ చాలా బాగుందని, ఈ ప్రక్రియను మరల ఎస్ వి వైద్య కళాశాలలోనే కొనసాగించాలని డాక్టర్ శ్రీహరి రావు ని కోరినారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్వరలో మరల డిసెంబర్ నెల లో కానీ జనవరిలో గాని రెండవ రౌండ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సి పాల్ డాక్టర్ జి రవి ప్రభు, సామాజిక వైద్య విభాగ అధిపతి డాక్టర్ ఎస్. సునీత, ఐ.ఎం.ఎ డాక్టర్లు,డాక్టర్ వాసుదేవ నాయుడు, డాక్టర్ జనార్దన్, డాక్టర్ యుగంధర్, డాక్టర్ హరికృష్ణ, విజయవాడ ఏపీఎంసీ సిబ్బంది, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్వో వీర కిరణ్ పాల్గొన్నారు.

## మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ



**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని సి రామాపురం గ్రామంలో మహిళలకు మూడు నెలల ఉచిత టైల రింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు ఈ కార్యక్ర మానికి ముఖ్య అధ్యక్షుడిగా జన శిక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎం మోహన్‌రాస్ కోఆర్డినేటర్ రామాంజులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్ గారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతి వృత్తులు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. నేర్చుకున్న మహిళలకు లోన్స్ ఇప్పిచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూస్తామని తెలియజేశారు. రాస్ నిర్వహించే కార్యక్రమాల గురించి తెలియజేశారు చివరగా నేర్చుకోవడా నికి వచ్చిన మహిళలకు ఉచితంగా శిక్షణ సామగ్రిని అందజేశారు ఈ కార్యక్రమంలో జనశిక్షణ సంస్థ డాక్టర్ బి.సుధాకర్ రెడ్డి టైలరింగ్ టీచర్ సుమతి రాసి సిబ్బంది శిల్ప , 50 మంది మహిళలు పాల్గొన్నారు.

## అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఉపయోగకరం



**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** పాఠశాల స్థాయిలో విద్యా ర్థులు ఎదుర్కొనే వివక్ష,పక్షపాతాలపై పిర్యాదుల కమిటీ ఏర్పాటు నిర్వహణ ఎంతో ఉపయోగకరమని డీ.ఎం.పురం ఉన్నత పాఠశాల హెచ్.ఎం నాదముని రెడ్డి తెలిపారు. ఉపా ధ్యాయులు, విద్యార్థులతో ప్రతి తరగతికి మరియు పాఠశాల మొత్తానికి లింగ,జాతి,లైంగిక ధోరణి వంటి వివక్షాలపై ఫిర్యాదులు చేసి పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చైర్మన్ గా ఆంగ్ల ఉపాధ్యాయురాలు సరస్వతి,సభ్యులుగా మాలతి,రాములు,కిషోర్ కుమార్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాల స్థాయి నుండి బాధ్యతగా , సత్ప్రవర్తన కలిగి సంస్కారంగా నడుచుకుని గొప్ప స్థాయికి ఎదగాలని వక్తలుకోరారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు డిల్లీ బాబు, బొజ్జా రాము, కలైవాణి, రంజిత్ కుమార్, సుమతి, హరి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం



**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని శ్రీ ధనమల్లి పంచాయితీ కార్యదర్శులు పనిచేస్తున్న ఎస్. కె ఖాదర్ మస్తాన్ సోమవారం ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు ఎంపీడీవో కార్యాలయం సందు ఉన్న సమావేశ మందిరంలో ఎంపీడీవో గోవర్ధన్ ఆధ్వర్యంలో ఖాదర్ మస్తాన్‌కు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ గోవర్ధన్, సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు ఖాదర్ మస్తాన్‌కు అతను సతీమణికి పూలమాలతో శాలు వాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యాక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, పామంజి శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, ఆనేపూడి సర్పంచి మురళి రెడ్డి మండల నాయకులు కలిసి పంచాయతీ కార్యద ర్శుకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో, పంచాయతీ కార్యదర్శులు మునిరెడ్డి, రామ య్య, మధు, నేలపట్టు సర్పంచ్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలపై నకిలీ స్టిక్కర్లు ఉంటే చర్యలు తప్పవు



**సత్యవేడు, మేజర్‌న్యూస్:** వాహనదారులు వారి వాహనాలపై నకిలీ స్టిక్కర్లు ఉన్నట్లయితే చట్టప్ర కారం చర్యలు తప్పవని తిరుపతి జిల్లా సత్యవేడు ఎస్ఐ రామస్వామి హెచ్చరించారు. జల ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు స్థానిక సీఐ మురళినాయుడు సూచనల మేరకు పోలీసులు నకిలీ స్టిక్కర్లపై కొరడా జులుపిం చారు. ఇందులో భాగంగా సోమవారం పట్ట ణంలోని గాంధీ విగ్రహం వద్ద పలు వాహనాలను ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు వాహనాలపై ఉన్న నకిలీ స్టిక్కర్లను పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామస్వామి మాట్లాడుతూ పోలీస్, ప్రెస్,రెవెన్యూ,అటవీ తదితర శాఖలకు సంబంధించి వారు కాకుండా ఇతరులు వారి వాహనాలపై అనధికారికంగా స్టిక్కర్లు వేసుకుంటే చర్యలు ఉంటాయన్నారు.కేవలం ఆయా శాఖలకు సంబంధించిన ఉద్యోగులు మాత్రమే వారు వినియోగిస్తున్న వాహనాలపై స్టిక్కర్లు వేసుకోవచ్చు అని అన్నారు. అలాగే ప్రాత్రికేయులుగా పని చేయని వారు వారి వాహనాలపై ప్రెస్ స్టిక్కర్లను వేసుకోకూడదు అన్నారు. తదనంతరం వాహనాల రికార్డులు కూడా పరిశీలించి కొందరికి జరిమానా విధించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పోలీసులు ఈశ్వర్ రెడ్డి,భాస్కర్, గురవయ్య ఉన్నారు.

# సవాళ్లను ఎదుర్కోవడానికి జీవన నైపుణ్యాలు ఎంతో అవసరం

**-ఎస్పీఎంవీవీ రిజిస్ట్రార్ రజిని**



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేందుకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్పీఎంవీవీ) రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజిని అన్నారు.ఎన్ఈపి 2020 ప్రకారం జీవన నైపుణ్యాల విద్యను మన పాఠ్యాంశాల్లో అలాగే బోధనా పద్ధతుల్లో విలీనం చేయాల న్నారు. ఈ మేరకు సోమవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యం సావేరి గెస్ట్ హౌస్‌లో పీఎం-ఉష సహకారంతో 'జీవన నైపుణ్యా లపై' మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు,ఉపాధ్యాయులు జీవితంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని సమర్థవంతంగా ఎదు ర్కొనేందుకు నైపుణ్యాలు అవసరమని చెప్పారు. ప్రధాన వక్తగా ప్రొఫె సర్ కె.శేఖర్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో సైకోసోషల్ సపోర్ట్ విభాగం, మాజీ రిజిస్ట్రార్ మరియు సీనియర్ కన్సల్టెంట్, నిమ్హాన్స్ (బెంగళూరు) మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిన పది జీవన నైపు ణ్యాలను వివరించారు. వీటిని అలవర్చుకుంటే వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో విజయం సాధించవచ్చన్నారు. విద్యార్థినుల్లో నిర్ణయం తీసు కోవడం, సమస్యలను పరిష్కరించడం,విమర్శనాత్మక ఆలోచనలు, మానసిక ఒత్తిడిని అధిగమించడం,ఇతరులతో స్నేహపూర్వకంగా మెలగడం వంటి నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ శిక్షణా కార్యక్రమం దోహదపడుతుందన్నారు.ప్రొఫెసర్ సి.వాణి మాట్లాడుతూ విద్యార్థులకు స్పెషలైజేషన్ స్కిల్స్ తో పాటు సోషల్ స్కిల్స్ చాలా ముఖ్యము అని తెలిపారు. ఈ మధ్యకాలంలో సబ్జెక్టు నాలెడ్జ్ ఉన్న కానీ సోషల్ స్కిల్స్ లేకపోవటం వలన స్టూడెంట్స్ ప్లేస్మెంట్స్ లో సెలెక్ట్ అవ్వలేకపోతున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమానికి శిక్షకులుగా విచ్చేసిన డాక్టర్ సంజీవ్ కుమార్,నిమ్హాన్స్, బెంగళూరు మాట్లాడుతూ టీచర్లు లైఫ్ స్కిల్స్ లో శిక్షణ తీసుకోవడం ద్వారా విద్యార్థులకి కూడా జీవన నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వగలుగుతారని తెలిపారు. ఈ జీవన నైపుణ్యాల వలన విద్యార్థులు వారి జీవితంలో ఎదురయ్యే సమస్యలని సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటారు అని తెలిపారు.ప్రొఫెసర్ ఆర్.ఉష మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమం జూన్ 30వ తేదీ నుండి జూలై 2వ తేదీ వరకు 35 మంది ఫ్యాకల్టీ ఎవరైతే ఇదివరకు జీవన నైపుణ్యాలలో శిక్షణ పొందలేదు వారు జీవన నైపుణ్యాలలో శిక్షణ పొందుతారని తెలియజేశారు. డాక్టర్ జి.శిరీష,డాక్టర్ వజిహాబాను, ప్రొఫెసర్ అరుణ,ప్రొఫెసర్ విజయలక్ష్మి ఇంటర్నేషనల్ డీన్ ప్రొఫెసర్ అనురాధ, ప్రొఫెసర్ సువర్ణ లత,ప్రొఫెసర్ లలిత, డాక్టర్ మల్లీశ్వరమ్మ,ప్రొఫెసర్ చండి, ప్రొఫెసర్ ఉషారాణి,డాక్టర్ తులసి, తదితర ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్.. 4 మోటార్ సైకిల్‌లు స్వాధీనం..

**నగరి, మేజర్‌న్యూస్:** మోటార్ సైకిల్ దొంగతనాలు చేసే అంతర రాష్ట్ర దొంగ అరెస్ట్, రూ.1,50,000 లు విలువ చేసే నాలుగు మోటార్ సైకిల్ లు స్వాధీనం చేసుకున్నట్లు నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు,



నగరి డిఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ స్వీయ పర్యవేక్షణలో దొంగతనాల నివారణ, నేరస్థులను పట్టుకోవడం కోసం ఎస్ఐ స్వీయ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నగరి పోలీస్ స్టేషన్ పరిధి లోని గత మూడు నెలలుగా ఏకాంబర కుప్పం రైల్వే స్టేషన్ కి సమీపంలో జరిగిన మోటార్ సైకిల్ దొంగతనాల పైన ప్రత్యేక శ్రద్ధ వహించి, రాబడిన సమాచారం మేరకు, మండపం జంక్షన్ వద్ద తమిళనాడులోని తిరువళ్లూర్ జిల్లా, తిరుత్తణి టౌన్‌కు చెందిన నారాయణస్వామి కొడుకు టి ఎన్.సర్గుణన్ అనుమానా స్పదంగా వుండగా, అతనిని అదుపులోనికి తీసుకొని విచారించగా, అతను గత కొంత కాలంగా నగరి మున్సిపాలిటీ, ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ వద్ద నాలుగు మోటార్ సైకిల్ లను దొంగలించినట్లు గుర్తించారు. అతని వద్ద నుండి 4 మోటార్ సైకిల్ లను రికవరీ చేశారు. ఇందులో ప్రతిభ కనబరచిన సిబ్బంది సురేష్, సత్య, గజేంద్ర, అశోక్, లోకనాధం, రమేష్ లను అభినందించారు.

## మాబడిలోని తరగతులను యథావిధిగా కొనసాగించండి

**- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు పేరడం గ్రామస్తుల వినతి**



**సత్యవేడు, మేజర్‌న్యూస్:** మాబడిలోని 3,4,5 తరగతులను యథా విధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు సత్యవేడు మండలం పేరడం గ్రామస్తులు పలువురు వినతి పత్రం సమర్పించారు. జిల్లా కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్ర మంలో టిడిపి నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పలువురు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ను కలిసి బడిలోని 3,4,5 తరగతులను వేరే స్కూ ల్లో విలీనం చేయడంపై వినతి అందించారు. ఈ సందర్భంగా గ్రామ స్తులు వెంకటేశ్వర్లు,మునస్వామి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాల్సింది పోయి, ఉన్న తరగతులను వేరే స్కూల్లో సమంజసం కాదన్నారు. విలీనం చేసినట్లయితే 3,4,5 తరగతుల విద్యా ర్థులు మెయిన్ రోడ్డు మీదుగా ప్రతిరోజూ పిల్లలు వెళ్లడం ప్రమాదక రంగా మారే అవకాశం ఉందన్నారు. దీంతోపాటు గ్రామస్థాయిలో ప్రాథమిక విద్య కుంటుపడే అవకాశాలు లేకపోలేదు అన్నారు. పైగా కొందరు తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు పాఠశాలకు పంప డానికి మొగ్గు చూపే అవకాశాలు ఉందన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కు వినతి సమర్పించి గ్రీవెన్స్ రసీదు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిలకమ్మ,కోకిల,జ్యోతి,బుజ్జమ్మ,భూషణ, రుక్మిణి, విమల, కృష్ణవేణి, జ్ఞానమ్మ లక్ష్మి, చిత్ర, జయమ్మ, మునస్వామి,శంకరయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కొండమల్లీ శ్వర స్వామికి అభిషేకం పూజలు



**వెదురుకుప్పం, మేజర్ న్యూస్:** మండలంలోని మాంబేడు పంచాయితీ డిఆర్ అండ్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమే త కొండ మల్లీశ్వర స్వామికి అభిషేక పూజలు చే శారు. సోమవారం కొండమల్లీ శ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న పంచ ముఖ ఆంజనేయస్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్యనిర్వాహులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అన్నమయ్య కీర్తనలతో భక్తులను అలరింపజేశారు.

## ఇసుక అక్రమ రవాణాపై చర్యలు



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** మండలంలో ఇసుక అక్రమ రవాణాపై పిల్ల పాలెం, స్వర్ణముకి నది పరివాహక ప్రాంతంలో సిబ్బందితో కలిసి తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం దాడులు చేశారు. ఈ ప్రాంతంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. అనంతరం తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రేణిగుంట మండలంలో ఎక్కడ ఇసుక అక్రమ రవాణా చేయడానికి వీలు లేదని అక్రమ రవాణా చేసే వారిపై చర్యలు తీసు కుంటామన్నారు. ఈ దాడుల్లో ఆర్ఐ జైకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

# టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం : ఎమ్మెల్యే నెలవల



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సోమవారం నాయుడుపేట మండలం చిగురు పాడు గ్రామంలో రూ.1.95 కోట్లతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, తారు రోడ్ల ప్రారంభోత్సవానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం విచ్చేశారు. చిగురుపాడు గ్రామస్తులు ముప్పై ఏళ్ల కలను సాకారం చేసే విధంగా రోడ్డును ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే విజయశ్రీని గ్రామస్తులు గుర్రంపై ఊరేగింపుగా పూలవర్షం కురిపిస్తూ కర్పూర హారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం రహదారి శిలాఫలకాన్ని ఎమ్మెల్యే విజయశ్రీ అవిష్కరించారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా పంచాయతీ నిధులు కూడా స్వాహా చేసిన ఘనత జగన్ ప్రభుత్వానిదే అని అన్నారు. నేడు కూటమి ప్రభుత్వం సీఎం నారా చంద్రబాబునాయుడు సారధ్యంలో నియోజకవర్గం కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందని ఆమె తెలియ జేశారు. దాదాపు 2:30 కి.మీ రూ.1.95 లక్షల రూపాయిలు సిసి రోడ్లు , తారు రోడ్లో, ఎన్ వి రోడ్డు నుండి చిగురుపాడు అగ్రహారం వరకు తారు రోడ్డును ప్రారంభోత్సవం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మస్తానయ్య, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు నెలవల రాజేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, మాజీ ఏఎంసీ చైర్మన్ సిరసం భేటీ విజయ్ భాస్కర్ రెడ్డి, నాయకులు పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, కట్ట వెంకటరమణారెడ్డి, ఓజిలి మండల అధ్యక్షులు గుజ్జలపూడి విజయ్ కుమార్ నాయుడు, నరేంద్ర, తిరుపతి పార్లమెంటు బిసి సెల్ కార్యవర్గ సభ్యులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్,కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు, రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.





# పాత కక్షలతో 150 మామిడి చెట్లు నరికివేత

## పోలీసులకు ఫిర్యాదు చేసిన రైతు



**పెనుమూరు, మేజర్‌న్యూస్:** ఓ రైతుకు సంబంధించిన మామిడి చెట్లను కక్షగట్టి 150 మామిడి చెట్టు నరికి వేసిన సంఘటన పెనుమూరు మండలంలోని చోటు చేసుకుంది. స్థానిక రైతు పద్మనాభం వివరాలు మేరకు మండలంలోని గుంటిపల్లి పంచాయతీ రామనాదపురం గ్రామానికి చెందిన చెంగల్రాయులు కుమారుడు పద్మనాభంకు 1.75 స్థలంలో ఎకరాల పొలం మామిడి పంట సాగు చేశారు. ఈ పొలం 2010లో కొనుగోలు చేసారు. ఇందులో 15 ఏళ్ళ క్రితం మామిడి మొక్కలు నాటి నేడు ఈ మామిడి చెట్లు పల సాయాన్ని అందిస్తుంది. అయితే ఆదివారం మామిడి తోపులో సుమారు 150 చెట్లను నరికేయాడంతో ఆరైతు కుటుంబం బోరున విలపించారు. ఈ విషయమై సోమవారం పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో తమ చెట్లను నరికి వేసిన వారిపై అనుమానితంగా ఉన్న జయ చంద్ర,రూపేష్, బాబు, తులసి, చిట్టెమ్మ, పాపులమ్మపై పద్మనాభం పిర్యాదు చేసాడు. వీరు కొద్ది రోజులుగా తనకు చెందిన స్థలంపై దొంగతనంగా 1బి సృష్టించి ఆ భూమి తమకు ఇచ్చేయాలని బెదిరిస్తున్నారని, ఈ స్థలం విషయమై పలుమార్లు భూవివాదం కూడా జరిగిందని, అయితే ఈ భూమి పై న్యాయస్థానంలో కూడా కేసు నడుస్తుందని. తమకున్న భూ పట పాస్ బుక్కు, వన్ బి ధ్రువీకరణ పత్రాలను జతపరచి పోలీసులకు పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు పెనుమూరు ఎస్ఐ రామచంద్రయ్య, రెవెన్యూ అధికారులతో సంప్రదించి స్థలంవిషయంపై తహసీల్దార్‌తో విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## జలకంఠేశ్వర స్వామి ఆలయంలో
# కంచి కామకోటి పీఠాధిపతి

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** రాయల్ చెరువు సమీపంలో వెలసియున్న భవాని జలకంఠేశ్వర స్వామి ఆలయాన్ని కంచి కామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి సత్యేంద్ర సరస్వతిలు సోమవారం సందర్శించారు. పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో వెలసియున్న విజయ గణపతి, భవాని జలకంటేశ్వర స్వామి, యోగాంజనేయ స్వామికి, లక్ష్మీనారాయణ స్వామికి, దక్షిణామూర్తి, బాలసుబ్రమణ్యం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీరామ కృష్ణ శర్మ, ముఖేష్, సునీత పాల్గొన్నారు.




జనం కోసమే
సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు ( బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116


# మద్యం మత్తులో కారులో ఊపిరాడక ఇద్దరు యువకుల మృతి

## పెట్రోల్ లేక ఆగిపోయిన కారు ఇంజన్

**తిరుపతి క్రైమ్, మేజర్‌న్యూస్:** మద్యం మత్తులో కారులో ఏసి వేసుకొని నిద్రపోవడంతో కారు పెట్రోల్ అయిపోవడంతో ఇంజన్ ఆగిపోయింది. దీంతో కారులో నిద్రిస్తున్న ఇద్దరు యువకులు దిలీప్, పిల్లారి వినాయక ఊపిరాడక మృతి చెందిన సంఘటన తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. తిరుచానూరు ఎస్సై సాయినాథ్ చౌదరి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ మండలం, గోవిందప్ప కండ్రిగ గ్రామానికి చెందిన తిరునం దిలీప్ పిల్లాడి వినాయక ఆదివారం రాత్రి తిరుచానూరులో పుటుగా మద్యం సేవించారు. రాత్రివేళ కావడంతో స్వగ్రామానికి వెళ్లలేక మత్తులోనే కారులో ఏసీ ఆన్ చేసి వారిద్దరూ నిద్రపోయారు. కారులో పెట్రోల్ అయిపోవడంతో ఒకపక్క వీరిద్దరూ మత్తులో ఉండటంతో ఊపిరి ఆడక, డోర్‌లాక్ పడిపోవడంతో సోమవారం ఉదయానికి వారిద్దరూ కారులోనే మృతి చెందారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం గోవిందప్ప కండ్రిగ గ్రామానికి చెందిన దిలీప్(25), వినయ్(20) అలియాస్ వినాయక వరుసకు అన్నదమ్ములు. దిలీప్ గ్యాస్ డెలివరీ బైగా పని చేస్తాడు. వినాయక టీటీడీలో కాంట్రాక్ట్ ఎంప్లాయ్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి తిరుచానూరులో దిలీప్ తన ఇంటి వద్ద తమ్ముడు వినయ్‌తో కలిసి కారులోనే మద్యం సేవించారు. మత్తుఎక్కువ కావడంతో కారులోనే నిద్రపోయారు. పెట్రోల్ అయిపోవడంతో కారులో ఉన్న ఏసీ ఆగిపోయింది. దీంతో వారిద్దరూ ఊపిరాడక మృతి చెందారు. తెల్లవారు జామున కుటుంబ సభ్యులు వచ్చి కారులో చూడడంతో ఇద్దరు మృతి చెంది ఉండటాన్ని గమనించి తిరుచానూరు పోలీసులకు, బంధువులకు తెలియజేశారు. తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ ఎస్ఐ సాయి నాథ్ చౌదరి సంఘటన స్థలానికి చేరుకొని దిలీప్ వినయ్ మృతదేహాలను ఎస్వి మెడికల్ కళాశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.






విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో చిత్తూరు జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.

పూతలపట్టు నియోజకవర్గం :
1.బంగారుపాళ్యం, 2.పూతలపట్టు
కుప్పం నియోజకవర్గం :
1. రామకుప్పం.
పలమనేరు నియోజకవర్గం :
1.గంగవరం, 2.బైరెడ్డిపల్లి

కె.సురేష్‌బాబు ( బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116



## ఆసియా కప్ స్టేజి -2 సిల్వర్ మెడల్ సాధించిన గణేష్ మని రత్నంను సన్మానించి జిల్లా కలెక్టర్

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:** ఈ నెల జూన్ 15 నుండి 20 వరకు సింగపూర్ లో జరిగిన ఆసియా కప్ స్టేజి -2 ఆర్చరీ లో పాల్గొని టీమ్ సిల్వర్ మెడల్ సాధించిన మన నాయుడుపేట తిరుపతి జిల్లా వాస్తవ్యుడు అయిన తిరుమూరు గణేష్ మని రత్నంను సోమవారం జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువ కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఇంకా మరిన్ని విజయాలు తెచ్చి మన జిల్లాకు, రాష్ట్రానికి,దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.



## పదవీ విరమణ వీడ్కోలు సమావేశం

**పలమనేరు మేజర్ న్యూస్:** మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సూప రెండెంట్ గా పని చేస్తున్న వీరారెడ్డి సోమవారం పదవి విరమణ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఆయన గత 35 సంవత్సరాలుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పలువురు ఆయనకు పూలమాలలు వేసి శాలవాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు, అధ్యాపకులు,పాలిటెక్నిక్ బాలికల మధ్య నా వీరారెడ్డి పేరు కేక్ తయారు చేయడం అందరినీ ఆకట్టుకున్నది. అందరి మధ్యన కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం బాలికల హాస్టల్ లో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహమ్మద్, ఏరు గుత్తి బాలాజీ, పలణి, చాణిక్య,శ్యామ్, అనిల్, ఆయన స్నేహితులు అభిమానులు పాల్గొన్నారు.




## గొల్ల కండిగ ప్రాథమిక పాఠశాలను విలీనం చేయవద్దని గ్రామస్తులు ధర్నా

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** కార్వేటి నగరం మండలం కే యం పురం పంచాయతీలో ఉన్న గొల్ల కండిగ ప్రాథమిక పాఠశాల విలీనం చేస్తున్నారన్న సమాచారం అందడంతో గ్రామస్తులు పాఠశాలలతో తన విద్యార్థిని విద్యార్థులు రోడ్డుపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఈ పాఠశాల విలీనం చేయరాదని నిరసన చేపట్టారు. ఈ గ్రామంలో దాదాపుగా 30 సంవత్సరాలు పైగా ప్రాథమిక పాఠశాల పనిచేస్తున్నాయని వెంటనే విలీనం రద్దు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




## ఏపీఎస్పీడీసీఎల్ అధికారుల సేవలు అమూల్యం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ పదవీ విరమణ పొందుతున్న జనరల్ మేనేజర్ ఎస్ఎల్ అంజనీ కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. శ్రీనివాసరావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మొహమ్మద్ అయూబ్ ఖాన్, పర్సనల్ ఆఫీసర్ పి.గజేంద్ర కుమార్,జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వికె దశరథ రామ్ ల సేవలు అమూల్యమని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు కే. గురవయ్య, పి.అయూబ్ ఖాన్ లు పేర్కొన్నారు.ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు గురవయ్య, అయూబ్ ఖాన్ తదితరులు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ లో వివిధ హోదాల్లో వారు వినియోగదారులకు అందించిన సేవలను కొనియాడారు. వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ సంస్థ అభివృద్ధికి వారు తమ వంతు సహకారాన్ని అందించారని తెలిపారు.పదవీ విరమణ పొందిన అధికారులు మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ లో వివిధ హోదాల్లో విధుల నిర్వహణలో తమకు



సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని సంస్థ అధికారులు,సిబ్బంది పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణా దేవి, కెఆర్ఎస్ ధర్మజ్ఞాని,పి.హెచ్. జానకిరామ్,కె.ఆదిశేషయ్య,ఎన్.శోభా వాలెంటీనా,కె.రామ్మోహన్ రావు,చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు,సిజిఆర్ఎఫ్ చైర్ పర్సన్ వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి, జనరల్ మేనేజర్లు సిహెచ్.రామచంద్ర రావు, సురేంద్ర రావు, ప్రసాద్, వెంకటరాజు, మురళీ కుమార్,నరేంద్రనాథ్,మధు కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ఎండార్స్మెంట్లు ఇస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోండి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తిరుపతి జిల్లాలో వేలాదిమంది పేదలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం అర్జీలు సమర్పించి రసీదులు పొందుతున్నారు.డిసెంబర్లో జరిగిన రెవెన్యూ సదస్సులో 15264 మంది తమ సమస్యల మీద అర్జీలు ఇచ్చారు. ఈ అర్జీలలో ఎక్కువ భాగం పరిష్కారం కాకుండానే అవి పరిష్కారం అయినట్టుగా ఎండార్స్మెంటు ఇచ్చిన రెవెన్యూ సిబ్బందిపై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ తరఫున ప్రజా ఫిర్యాదుల సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ కు విన్నవించడం జరిగింది. ఇందుకు ఉదాహరణగా శ్రీకాళహస్తి మండలం,అమ్మ చెరువు గ్రామంలో చెరువు ఆక్రమణ తొలగించాలని అర్జీ ఇవ్వగా ఆన్లైన్లో నమోదయింది.ఈ సమస్య పరిష్కారమైనట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుకు ఆన్లైన్ ఎండార్స్మెంట్ వచ్చింది.ఇదే విధంగా దొరవారి సత్రం మండలం తనియాలీ గ్రామ ప్రజలకు, తడ మండలం సుందరాపురం గ్రామ ప్రజలకు,కాంద్ర ప్రజలకు ఇలా అనేకమందికి ఇటువంటి తప్పుడు ఎండార్స్మెంట్లు ఇచ్చి పై స్థాయికి నివేదికలు పంపడం వల్ల 98.94% పరిష్కారం అయినట్లు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది.రెవెన్యూ సదస్సులలో వచ్చిన 15264 అర్జీలలో 15103 అర్జీలు పరిష్కారమైనట్లు నివేదికలు పంపి ఉన్నారు.అంత శాతం పరిష్కారం అయి ఉంటే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వందలాదిమంది పేదలు తమ భృతి పోగొట్టుకొని వందలాది రూపాయలు ఖర్చు పెట్టుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేదు.ఈ తప్పుడు నివేదికలపై సమగ్ర విచారణ జరిపి వీటిని పంపిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇంటింటికి టిడిపి ప్రజాప్రతినిధులు తిరగతామని రెవెన్యూ సమస్యలు పరిష్కరించకపోతే చూస్తూ ఉండనని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి..ప్రతి సోమవారం వచ్చే అర్జీలు పరిష్కారం గురించి శ్రద్ధ పెడితే బండారం బయటపడుతుందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రెవిన్యూ సిబ్బంది ప్రభావితం చేసి ప్రజలకు ఇబ్బంది పెడుతున్నారని రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే మంజుల అనే మహిళ తమ సొంత బంధువైన చిన్నాన్ననీ ఎనగలూరు గ్రామ భూ సమస్యలో జోక్యం చేసుకొని ఇబ్బంది పెట్టిందని ఆరోపిస్తూ అర్జీ సమర్పించారు.ఈ సమస్యలను పరిష్కరించకపోతే ప్రజాప్రతినిధులను, అధికారులను సిపిఎం తరఫున నిలదీయాల్సి వస్తుందని హెచ్చరించారు.



## ద్రౌపతి సమేత ధర్మరాజు ఆలయంలో బకాసుర వధ

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** కార్వేటినగరంలో వెలసిన ద్రౌపతి సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు సోమవారం ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పుష్కరి నుండి తీర్థం తీసుకుని వచ్చి అభిషేక నిర్వహించారు. రాహుకాలం పూజలు కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద లేట్. ఆర్ముగం ఆచ్చారి (సన్స్ ) రమేష్ ఆచ్చారి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భాగవతా దారిని రెడ్డమ్మ వారిచే బకాసుర వధ హరికథలు నిర్వహించారు. రాత్రి వీధి నాటకం వెంకటేశ్వర నాట్య కళామండలి కిరణ్ కుమార్ వారిచే వీధి నాటకం నిర్వహించారు. ఆలయము చుట్టూ గ్రామం పూర్తిగా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి మొదలియార్, ఉప కోశాధికారి సాయి రాయల్, ఉభయదారులు విశ్వబ్రాహ్మణులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# చంద్రగిరి మండల ఎంపీడీవో కార్యలయంలో మండల సర్వసభ్య సమావేశం

**- మండల సర్వసభ్య సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరైన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని..**

**-మండలం పరిధిలోని సమస్యలను గ్రామ పంచాయతీ సర్పంచులను, ఎంపీటీసీలను సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే**

**- చంద్రగిరి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి అధికారులు సహకరించాలని కోరిన ఎమ్మెల్యే..**

**- ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా ప్రజలకు అందే విధంగా అధికారులుచర్యలుతీసుకోవాలి: ఎమ్మెల్యే**

**-పంచాయతీలలోని సమస్యలు డ్రైనేజ్, వాటర్ ట్యాంక్, పైప్ లైన్,సీ.సీ రోడ్లు, నూతన అంగన్వాడి భవనాలు, ఇతర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన అధికారులు, ప్రజాప్రధినిధులు..**



**చంద్రగిరి, మేజర్న్యూస్:** చంద్రగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయములో మండలసర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ముక్యంగా గత వైకాపా పాలకులు నిర్లక్ష్య వైఖరితో ప్రతివ్యవస్థ గాడి తప్పిందని.... వాటిని సరిదిద్దడానికి కొంచెం సమయం పడుతుందని అన్నారు. అందుకు అధికారులు కూడా పూర్తిగా సహకరించాలని కోరారు. విద్యా వ్యవస్థను సైతం గాలికి వదిలేసారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో 95 శాతం మందికి తల్లికి వందనం అందించడం జరిగిందన్నారు. స్కూల్ పిల్లలకు ప్రత్యేక ఆధార్ డ్రైవ్ ను సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను కోరారు. చంద్రగిరి మండలం పరిధిలోని రంగంపేట స్కూల్ ను మోడల్ స్కూల్ గా ఏర్పాటుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ శాఖలో రీ సర్వే నిర్వహించడం జరిగింది.....దానిలో భాగంగా చంద్రగిరి మండలంలో నిర్వహిస్తున్న రీ సర్వేలో రైతులకు ఇబ్బంది కలగకుండా రీ సర్వే చేయాలని అధికారులను కోరారు.చంద్రగిరి మండలంలో 177 స్మశాన వాటికలు గుర్తించిన రెవెన్యూ శాఖ అధికారులు....ఆయా పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శిలు స్మశాన వాటికలు రోడ్లు, ఇతర సమస్యలను త్వరగా ఎంపీడీవో, తహసీల్దార్ కుదృష్టికి తీసుకువెళ్ళి వాటి వివరాలు ఇవ్వాలని ఎమ్మెల్యే తెలిపారు.రానున్నది వర్ష కాలం కాబట్టి ఇరిగేషన్, పంచాయతీ రాజ్ శాఖల ఇద్దరు కలసి చిన్న చిన్న మరమత్తులు త్వరగతన పూర్తి చేయాలని అధికారులకు తెలిపిన ఎమ్మెల్యే. చంద్రగిరి మండలంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన లే అవుట్ లలో బినామీ పేర్లతో ఇచ్చిన పట్టాలను గుర్తించి.. వారిపై శాఖాపరమైన చూసుకోవాలని అధికారులకు తెలిపారు. అసలైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి. చంద్రగిరి మండలంలో జంగిల్ క్లియరెన్స్ త్వరగా పూర్తి చేయాలని అధికారులకు తెలిపిన ఎమ్మెల్యే.త్వరలోనే చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామని తెలిపిన ఎమ్మెల్యే.చంద్రగిరి మండలంలో విచ్చలవిడిగా గంజాయి ఉంది.....

ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు..... ఎక్సైజ్ శాఖ అధికారులపై త్రీవ స్థాయిలో మంది పడ్డ ఎమ్మెల్యే గారు. చంద్రగిరి మండలంలో భారీగా గంజాయి అమ్ముతున్నారు.....ముక్యంగా డాబాల వద్ద గంజాయి అమ్ముతున్నారు.నాకు వ్యక్తిగతంగా పోటోలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా %ూ%4 విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.%ూ%4 విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని అధికారులకు తెలిపిన ఎమ్మెల్యే. కొత్తగా వచ్చిన పంచాయతీ సెక్రటరీలు పార్టీలకు అతీతంగా అభివృద్ధి ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు.చంద్రగిరిలో నిర్మిస్తున్న గోవింద ధామంకు మతాలకు, పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని అధికారులకు, ప్రజా ప్రతినిధులుకు పిలుపు నిచ్చిన ఎమ్మెల్యే. అతి త్వరాలనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని తెలిపిన ఎమ్మెల్యే. రోడ్డు విస్తరణ పనులను పార్టీలకు అతీతంగా ముందుకు రావాలని చంద్రగిరి ప్రజలను, ప్రజా ప్రతినిధులను కోరిన ఎమ్మెల్యే.

## శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయం

**చిత్తూరు ప్రతినిధి మేజర్ న్యూస్.** జనసంగ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ కేంద్ర మంత్రి శ్యామ్ ప్రకాష్ ముఖర్జీ సేవలు చిరస్మరణీయమని బి జె పి చిత్తూరు సెంట్రల్ మండల అధ్యక్షులు జి. షణ్ముగం తెలిపారు. సోమవారం ఉదయం చిత్తూరు గాంధీ విగ్రహం ఎదుట బి జె పి చిత్తూరు సెంట్రల్ మండల అధ్యక్షులు జి. షణ్ముగం ఆధ్వర్యంలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దివంగత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో భారతదేశపు మొదటి పరిశ్రమ సరఫరా మంత్రిగా పరిశ్రమల మంత్రిగా పనిచేశారు. కాశ్మీర్లో ఆర్టికల్ 370 ని రద్దు చేయాలని పోరాడారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, బిజెపి చందు, రామభద్ర, గోకుల్ యాదవ్, వేణుగోపాల్,సత్య జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

## కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

**కార్వేటి నగరం (మేజర్ న్యూస్):** కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి తెలిపారు. కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బి ఎ పొలిటికల్ సైన్స్ వంటి కోర్సులు ఉన్నాయని తెలియజేశారు. విద్యార్థులకు ఆరు స్మార్ట్ బోర్డులు గల డిజిటల్ క్లాస్ రూములు, అనుభవజ్ఞులు మరియు నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యాబోధన , ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన కంప్యూటర్లు, ఉద్యోగ సాధనకు శిక్షణ ఇచ్చే జెకెసి, సమాజ సేవను ప్రోత్సహించే ఎన్ ఎస్ ఎస్ యూనిట్, మంచి గ్రంథాలయము, క్రీడా రంగాన్ని ప్రోత్సహించే వ్యాయామ శాఖ వంటి ఎన్నో సౌకర్యాలు ఉన్నాయని తెలియజేశారు. అడ్మిషన్ల కొరకు కళాశాల ఆఫీసు నందు సంప్రదించగలరని తెలియజేశారు.

## శివయ్య సేవలో జానపద గాయకులు



శ్రీకాళహస్తి మేజర్ న్యూస్: శ్రీ రాహుల్ సిప్లిగంజ్, తెలుగు సినిమా జానపద పాటలు గాయకులు రచయిత కుటుంబ సభ్యులతో సోమవారం శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనార్థం విచ్చేశారు. వారికి దేవస్థానం అధికారులు రాహు కేతు పూజ,దర్శనం ఆశీర్వచనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, పండితులు పాల్గొన్నారు.

## పాఠశాల విలీనాన్ని వ్యతిరేకంగా రాజుగుంట, అముడూరు గ్రామస్తులు పోరాటానికి సిపిఎం మద్దతు



**శ్రీకాళహస్తి మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ప్రభుత్వం తమ గ్రామంలో పాఠశాలలను దూర ప్రాంతంలో గ్రామానికి తరలించడాన్నీ వ్యతిరేకిస్తూ శ్రీకాళహస్తి మండలం రాజు గుంట గ్రామస్తులు, ఏర్పేడు మండలం అమ్మడూరు గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వంద వాసి నాగరాజు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేదలని చదువుకు దూరం చేయొద్దని పాఠశాల విలీనాన్ని వెంటనే ఆపాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం లాగా తమ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేయనని ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఇప్పుడు పేదలకి అన్యాయం చేయడం సరైనది కాదని వందవాసి నాగరాజు తెలిపారు. పేదలు చేస్తున్న పోరాటానికి సిపిఎం పార్టీ మద్దతుగా ఉంటుందని ఆయన తెలిపారు.

## ఉపాధ్యాయుడిగా శ్రీనివాసులు సేవలు అభినందనీయం

### -ఎంఈఓలు వేణు,శ్రీను

**పలమనేరు మేజర్ న్యూస్:** తన ముప్పై ఆరేళ్ళ ఉపాధ్యాయ వృత్తిలో క్రమశిక్షణతో వృత్తికే అంకితమై పనిచేసిన శ్రీనివాసులు సేవలు అభినందనీయమని గంగవరం ఎం. ఈ.ఓ. లు వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు కొనియాడారు.గంగవరం మండలంలోని పత్తికొండ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ శ్రీనివాసులు సోమవారం పదవీ విరమణ చెందారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ నందు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎం.ఈ.ఓ



లు వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ.....గత ముప్పై ఆరు సంవత్సరాలుగా ఎందరికో విద్యాబుద్ధులు నేర్పించి విద్యాభివృద్ధికి శ్రీనివాసులు తోడ్పడ్డారన్నారు.ఆయన తన కుటుంబ సభ్యులందరినీ ఈ పదవీ విరమణ కార్యక్రమంలో భాగస్వాములను చేయడం చాలా బాగుందన్నారు.పలువురు ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ..... ఉద్యోగులు ప్రతి ఒక్కరికీ చివరి దశలో పదవీ విరమణ చెందుతారని అయితే ఉపాధ్యాయులుగా పనిచేసి ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి సమాజానికి వెలుగులు నింపుతున్న ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధానోపాధ్యాయులు రమేష్,రమణ,పసల సుబ్రమణ్యం, యాసిన్ షరీఫ్,ఉమామహేశ్వర రెడ్డి,చెంగప్ప,దామోదరం, జి.ఎస్. రామమూర్తి,మాధవ నాయుడు, ఉపాధ్యాయులు చందనం రామయ్య,కుబేర నాయుడు,రామమోహన్, సుదర్శనాచ్చారి,బాలకృష్ణ,ప్రసన్న కుమార్,జయచంద్రన్, తులసీ నాదం నాయుడు,ఏ.ఆర్. కుమార్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఇంకనూ సన్మాన గ్రహీత శ్రీనివాసులు బంధువులు మిత్రులు,ఆప్తులు, శ్రేయోభిలాషులు పాల్గొని శ్రీనివాసులు,శాంతమ్మ దంపతులకు సన్మాన సత్కారాలు చేసి ఆయన కుటుంబానికి ఆయురారోగ్యాలు కలగాలని, ఆయన శేష జీవితం సుఖశాంతులతో కొనసాగాలని కోరుకున్నారు.

## కనకదుర్గాదేవి ఆలయంలో ఆషాడ గుప్త వారాహి నవరాత్రులు



**పలమనేరు మేజర్న్యూస్:** శ్రీ కనకదుర్గాదేవి దేవస్థానంలో సోమవారం ఆషాడ గుప్త శ్రీ వారాహి నవరాత్రులలో భాగంగా అమ్మ వారిని వారాహీదేవి అవతారం లోఅలంకరించారు.ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.అమ్మవారి ఆలయంలోజూలై 4వ తేదీ శుక్రవారం నవమి వరకు ఆషాడ గుప్త శ్రీ వారాహి నవరాత్రులు నిర్వహిస్తున్నారు.ప్రతి మంగళ శుక్రవారాలలో రాహు కాల పూజలు,అభిషేకాలు, ప్రతి అమావాస్య రోజున ప్రత్యేక పూజలు,దుర్గా హెూమం, కుంకుమార్చనలు,పౌర్ణమి లలితా సహస్రనామ హెూమం,పారాయణం తో పాటు,ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు కనకదుర్గాదేవి దేవస్థాన కమిటీ సభ్యులుకె.వి.రమణ, సి.పి ప్రకాష్, కే.ఎం నాగరాజు,యువరాజు తదితరులు తెలిపారు. బృహత్ వారాహి హెూమాన్ని సోమవారం సాయంత్రం భక్తులు నిర్వహించారు.

## సమస్యలను పరిష్కరిస్తాం

**పుంగనూరు మేజర్ న్యూస్:** పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో రాము అధ్యక్షతన సోమవారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు మానిటరింగ్ కమిటీ సభ్యులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారుఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ సభ్యుల సమస్యలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## 11వ క్లస్టర్ ఇన్చార్జిగా కన్నన్



**కుప్పం, మేజర్ న్యూస్ :** కుప్పం నియోజకవర్గం 11వ క్లస్టర్ ఇన్చార్జిగా కన్నన్ ను నియమిస్తున్నట్టు టిడిపి వర్గాలు తెలిపాయి. గత సార్వత్రిక ఎన్నికలలో 11వ క్లస్టర్ పరిధిలో పార్టీ బలోపేతానికి కన్నన్ చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం తనను ఇన్చార్జిగా నియమించడం జరిగిందని స్థానిక టిడిపి నాయకులు తెలిపారు. కన్నన్ క్లస్టర్ గా నియమితులైన సందర్భంగా స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో అభినందనలు తెలిపారు. అనంతరం నూతన క్లస్టర్ ఇంచార్జ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నూతన పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబుకు, ఇందుకు సహకరించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కు, ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావుకు, ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నంకు, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా తనకు అప్పగించిన పదవీ బాధ్యతలలో భాగంగా స్థానిక టిడిపి నాయకులను సమన్వయం చేసుకొని, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా అట్ల గోపాల్ జన్మదిన వేడుకలు

**పెళ్లకూరు మేజర్ న్యూస్:** మండలంలోని నెలబల్లి గ్రామానికి చెందిన వై.సి.పి నాయకుల అట్ల గోపాల్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారి చేత భారీ ఎత్తున కేక్ కట్ చేపించి శాలువాతో సత్కరించి హృదయ పూర్వకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేసారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుడుని ప్రార్థించారు. నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు సాగి జితేంద్ర, బండి బాలు కన్నలి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీ ఎంపిక

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** మండలపరిధిలోని విందూరు కండ్రిగ గ్రామంలో ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఉదయం నిర్వ హించిన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గొల్లపల్లి సిసింద్రీ మాదిగ ఆద్వర్యంలో నిర్వహించారు. యువకులతో నూతన ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల మాదిగలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద




ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నియోజకవర్గ అధ్యక్షులు సతీష్ రాజ్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ లో మహా టీవీ న్యూస్ రిపోర్టర్ల పై దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ కోశాధికారి భాను ప్రకాష్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గిరి శేఖర్ నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## స్వప్న వైష్ణవి దేవిగా అమ్మవారు

**చౌడేపల్లి రూరల్ మేజర్‌న్యూస్:** చౌడేపల్లి మండలం పుదీపట్ల గ్రామానికి చెందిన స్వయంభు వైష్ణవి దేవి ఆలయంలో వారాహి దేవి నవరాత్రులలో 5వ రోజు స్వప్న వైష్ణవి దేవిగా దర్శనమిచ్చారు. ఈ అమ్మవారిని దర్శించుకున్న వారికి దుస్వప్న నివారణ, నిద్ర సమస్యలు నిర్మూలన, భూగృహ సమస్యల పరిష్కారం జరుగును. ఆలయ అర్చకురాలు శ్రావణి ఉదయాన్నే అమ్మ వారికి పంచామృత అభిసేకాలు అనంతరం దర్శనభాగ్యం కల్పించారు. పుంగనూరు చౌడేపల్లి చుట్టుపక్కల గ్రామప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వినోద్ కుమార్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా పుంగనూరుకి చెందిన అనంతమహేష్ సరితలు వ్యవహరించారు.



## ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

**గూడూరు, మేజర్‌న్యూస్:** విద్య పేరుతో వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు



చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శశికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గూడూరు పట్టణంలోని సనత్ నగర్ ప్రాంతంలో ఉన్నశ్రీ చైతన్య స్కూల్ వద్ద ఏఐఎస్ఎఫ్ గూడూరు నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ శ్రీచైతన్యస్కూల్లో విద్యను వ్యాపారం చేస్తూ స్కూల్లోనే యూనిఫాం, బుక్స్, తదితర విద్యార్థులు కావాల్సిన సామాగ్రిని పాఠశాలలోనే అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారం చేస్తునారు అన్నారు. టెక్నో ఐఐటి, ఒలంపియా వంటి పేరుతో ప్రభుత్వా నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నడుపుతున్నారన్నారు. ప్రభుత్వా నిబంధనలు కు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎఐఎస్ఎఫ్ ఆందోళనతో డిప్యూటీ డిఇఓ సనత్‌కుమార్ పాఠశాలను పరిశీలించి, పుస్తకాలు విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి సూర్య, నియోజకవర్గ కార్యదర్శి యశ్వంత్, నాయకులు ప్రణయ్, భాను, రవితేజ, గణేష్, తరుణ్, సందీప్, నిజాం, రత్నయ్య, మస్తాన్, దినేష్ పాల్గొన్నారు.



## కుప్పం బీజేపీ ఇన్‌చార్జ్‌గా తులసీనాథ్

**కుప్పం, మేజర్‌న్యూస్:** భారతీయ జనతా పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్చార్జిగా ఎన్ఎస్ తులసినాథ్‌కు బాధ్యతలు అప్పగిస్తూ చిత్తూరు జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వరనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆయన జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నేటి నుండి కుప్పం నియోజకవర్గ పరిధిలో పార్టీ సంస్థాగత వ్యవహారాలు, కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను సైతం అప్పగిస్తున్నట్టు ఉత్తర్వులలో పేర్కొన్నారు. నూతన ఇన్చార్జి మాట్లాడుతూ బిజెపి సీనియర్ నాయకుడిగా రెండు పర్యాయములు కుప్పం శాసనసభ్యులుగా పోటీ చేసిన అనుభవం తనకు ఉందన్నారు. కూటమి నాయకులతో సమన్వయమై, బిజెపి బలోపేతానికి పనిచేస్తానని తెలిపారు.

## నెరవేరిన దశాబ్దాల దారి సమస్య

### పనులు చేపట్టాలని సూచించిన మండల తెదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి

**చౌడపల్లి రూరల్ మేజర్ న్యూస్:** దశాబ్దాల తరబడి ఉన్న భక్తుల దారి సమస్య మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి చొరవతో తీరింది. చౌడేపల్లి మండలం చారాల పంచాయతీ జంగాలపల్లికి సమీపంలోని యోగ మల్లేశ్వర స్వామి ఆలయానికి దారి సమస్య ఉంది. దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వామి ఆలయానికి వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి చౌడేపల్లి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించారు. దారితోపాటు ఆలయం వద్ద నీటి కోసం బోర్ డ్రిల్లింగ్ చేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు



అధికారులకు పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో దశాబ్దాల తరబడి ఉన్న సమస్యలు పరిష్కరించబడ్డాయని భక్తులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీధర్ రాజు , గిరిరాజు, సుజన్ రాజు , భోయకొండ సుబ్బు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనింగ్ కబంధ హస్తాలలో భూములను పేదలకు పంచాలి

**గూడూరు, మేజర్‌న్యూస్:** మైనింగ్ కబంధ హస్తాల్లోని మిగులు భూములను పేదలకు పంచాలని ఎఐకెఎంఎస్ జాతీయ కార్యదర్శి బి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ఉమ్మడి నెల్లూరు . జిల్లా సదస్సు గూడూరులోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎఐకెఎంఎస్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు డిపి పోలయ్య అధ్యక్షతననిర్వహించారు. ఈ సభను ఉద్దేశించి అఖిలభారత ఏఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు బి భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్నీ సైతం కార్పోరేట్ శక్తులకు కట్టబెట్టడానికిపూనుకుందని ఆరోపించారు. అఖిల భారత రైతు కూలి




సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి ప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు వందల వేలఎకరాలు కట్టబెడుతున్నాయనీ ఆరోపించారు. పోలయ్య మాట్లాడుతూ భూస్వాములు పెత్తందారులు అక్రమంగా ఆక్రమణ చేశారని దీన్ని పట్టించు కోకుండా ప్రభుత్వ భూమిని నిరుపేదలు ఆక్రమించుకుని చెట్టు పుట్ట తొలగిస్తే మాత్రం రెవిన్యూ అధికారులకు నిద్ర పట్టడం లేదని ఎద్దేవా చేశారు. అన్యాక్రాంతం అయిన అసైన్మెంట్ భూములను లబ్ధిదారులకు దళితులకు పేదలకు ప్రభుత్వం స్వాధీనం చేయాలనీ డిమాండ్ చేశారు. ఐ ఎఫ్ టి యు జాతీయ అధ్యక్షులు ఆరేళ్ళ కృష్ణయ్య మాట్లాడుతూ అఖిల భారత రైతు కూలిసంఘం నాయకత్వంలో భూమి కోసం భుక్తి కోసం అనే నినాదం తో మైనింగ్ కబంధ హస్తాలలో ఉన్న భూములను పోరాడి విడిపించి పేదలకు ఆ భూములను పంచేదాకా వెన్ను చూపకుండా పోరాటాలు సాగిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో ఐ ఎఫ్ టి యు ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు కె రమేష్,ప్రగతి శీల మహిళా నాయకురాలు బి.మమత, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు డి నవ కోటి, కె చెంగల్ రావు, ఏఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి ఎం అంకయ్య పాల్గొన్నారు.

## చల్లా బాబు ఆశీస్సులు అందుకున్న పగడాల హరి రాయల్

**చౌడేపల్లి రూరల్ మేజర్ న్యూస్:** చౌడేపల్లి సింగిల్ విండో అధ్యక్షుడిగా నియమితులైన పగడాల హరి రాయల్ సోమవారం పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆశీస్సులను అందుకున్నారు. ఈ మేరకు ఆయన నివాసానికి వెళ్లిన హరి రాయల్ ను చెల్లా బాబు ఆశీర్వదించారు. అదేవిధంగా రైతులకు అందుబాటులో ఉండి పార్టీని బలోపేతం చేస్తూ రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆయన సూచించారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ యొక్క విధివిధానాలను దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నేత మాదిరాజు ప్రదీప్ రాజు సీనియర్ నాయకులు లక్ష్మణరాజు (పతిరాజు) కార్తీక్ రాయల్



సాగర్ నాయుడు రెడ్డి ప్రసాద్ ప్రహ్లాద చౌడేపల్లి మండలానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అపద్ధపు హామీలతో అధికారంలోకి కూటమి ప్రభుత్వం

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైకాపా అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చిత్తూరు నియోజకవర్గంలో చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త ఎంసీ విజయానంద రెడ్డి అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అమలు తీరును ప్రజలకు తెలియజేసేలా యాప్‌ను ప్రారంభించారు. భూమన్ కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలను మభ్య




పెట్టేలా నాటి ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలు మూడు నెలల్లో అమలు చేస్తామని ఏడాదికావస్తున్న నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ఇలా అనేక హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వ బూటక హామీలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు నూతనంగా యాప్‌ను రూపొందించి ప్రజా క్షేత్రంలో కూటమి ప్రభుత్వ తీరును వివరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ వైకాపా నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

